ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
బుధవారం 12 మార్చి 2025 | 5



రంజాన్ వేళలు
ఇఫ్తార్ (బుధ) సా.6.21
సహరి (గురు) ఉ.4.52

శతమానం భవతి..

శతమానం భవతి.. అంటే వందేళ్లు కలిసిమెలిసి హాయిగా.. ఆనందంగా జీవించమని అర్థం.. ప్రతి పెళ్లిలోనూ ఈ మాట వినిపించక మానదు.. అయితే ఈ చిత్రంలో జంటను చూశారా.. గత వందరోజులుగా ఏదో ఒక చోట శతమానంభవతి అనిపించుకుంటున్నారు.. అయితే వంద రోజులుగా పెళ్లి చేసుకుంటున్నారా అనొద్దు.. వీరిద్దరి నిశ్చితార్థం నుంచి పెళ్లి వరకూ వంద రోజులు సమయం వచ్చింది.. ఫోన్‌లో చాటింగ్‌లతో కాలం వృథా చేయడం ఎందుకు అనుకున్నారు.. ప్రతిరోజూ ఏదో ఒకచోట సాయం చేస్తూ ముందుకు సాగుతున్నారు.. బుధవారం రావులపాలెంలో సీఆర్‌సీ వేదికగా ఈ జంట ఒక్కటవుతున్నారు.. వీరిని మనం కూడా శతమానంభవతి అని దీవించేద్దామా...!



6

'తూర్పు'న కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటుచేయాలి

లోక్‌సభలో ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యేక కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లోక్‌సభలో మంగళవారం కొబ్బరి రైతుల సమస్యలను పురందేశ్వరి ప్రస్తావించారు. రాజమండ్రి కేంద్రంగా కొబ్బరి బోర్డు ఏర్పాటుచేస్తే రాష్ట్రంలోని రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కొబ్బరిసాగులో ఆంధ్రప్రదేశ్ నాల్గవ స్థానంలో ఉందన్నారు. ప్రధానంగా కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో 1.23 లక్షల హెక్టార్లలో కొబ్బరి తోటలు ఉన్నాయన్నారు. 1981లో ఏర్పాటైన కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రధాన కార్యాలయం కేరళలో ఉండడం ప్రాంతీయ కార్యాలయాలు ఆంధ్రప్రదేశ్‌కు దూరంగా ఉండడంతో రైతులు సకాలంలో సలహాలను పొందడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల కొబ్బ రికి వచ్చిన తీవ్రమైన ముప్పులను పరిశీలిస్తే కొబ్బరి బోర్డు దగ్గరలోనే ఉండాలన్న తక్షణ అవసరాన్ని తెలియజేస్తున్నదన్నారు. ఏపీ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని 'తూర్పు'న ప్రత్యేక కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయం ఏర్పాటుచేయాలని కోరారు.

ఏపీలో కంప్రెస్డ్ బయో గ్యాస్ పరిస్థితి ఏంటి?

రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పెట్రోలియం, నేచురల్ గ్యాస్‌కు సంబంధించి కంప్రెస్ట్ బయో గ్యాస్ (సీబీజీ) పైప్‌లైన్ మౌలిక సదుపాయాలకు ఎటువంటి లక్ష్యాలను నిర్దేశించిందని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు ప్రశ్నించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం పలు అంశాలు లేవనెత్తారు. ఏపీలో ఈ పథకం అమలు స్థితి, కాకినాడ జిల్లాలో గ్యాస్ పంపిణీ నెట్ వర్క్ ద్వారా లబ్ధిదారుల వివరాలు కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హరిదీప్‌సింగ్ పూరి కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్లను సీజీడీ నెట్ వర్క్‌కు అనుసంధానానికి రూ.994.50 కోట్ల నిధులతో 100 ప్రాజెక్టులు చేపట్టడం జరిగిందన్నారు. గతేడాది చివరికి రాష్ట్రంలో 246 సీఎన్‌జీ స్టేషన్లకు కాకినాడలో 13 స్టేషన్లు, 2,91,383 డొమెస్టిక్ కనెక్షన్లకు కాకినాడలో 66,301 కనెక్షన్లు ఇచ్చారని వివరించారు. పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, ఉద్యోగావకాశాలు పెంపు లక్ష్యాలపైనా సానా ప్రశ్నించారు.

ఓమై.. గాడ్!



నామినేటెడ్ పదవులకు తీవ్ర పోటీ

- ఉమ్మడి జిల్లాలో 1713 ఆలయాలు
- పెద్ద ఆలయ బోర్డులకు డిమాండ్
- వాడపల్లి ఆలయంపై ప్రధాన దృష్టి
- పోటీపడుతున్న కూటమి నేతలు
- ప్రముఖ ఆలయాల్లోనూ ఇంతే
- నియోజకవర్గాల వారీ కసరత్తు
- పెరుగుతున్న ఆశావహులు
- కొన్ని కుర్చీలపై కర్చీఫ్‌లు
- ద్వితీయస్థాయి నేతల పైరవీలు

(రాజమహేంద్రవరం /అమలాపురం - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో నామినేటెడ్ పోస్టులకు ఆశావహులు పెరుగుతున్నారు. ఇప్పటినుంచే ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల ముందు క్యూకడుతున్నారు. పోస్టులు ఇప్పించాలని కోరుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వమేర్పడి పది నెలలు కావస్తుండడంతో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కూటమి నాయకులు ఊహల పల్లకిలో విహరిస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశం కల్పించాలంటూ నియోజకవర్గ ఎమ్మెల్యేల ద్వారా పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఆర్థిక స్థోమత కలిగిన మరికొందరు వ్యూహాత్మకంగా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.ఈ నెలాఖరుకి లేదా ఏప్రిల్ చివరికి వేలాది మంది కూటమి నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయి.



పోస్టుల భర్తీపై సీఎం సమీక్ష



నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఇటీవల సీఎం నారా చంద్రబాబునాయుడు అమరావతిలో ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. మార్చి నెలాఖరుకు నియోజకవర్గస్థాయిలో ఉన్న మార్కెట్ కమిటీలు, దేవస్థానాలు, ఇతర కమిటీల్లో నియామకాలను పూర్తి చేస్తామని ప్రకటించారు. సొసైటీలకు పాలకవర్గాలు, డీసీసీబీ కమిటీలకు సభ్యుల నియామకాన్ని పూర్తిచేసే యోచన ఉంది.

కత్తిమీద సాములా..

ఈనెల 14వ తేదీన పిఠాపురం కేంద్రంగా జనసేన రాష్ట్ర స్థాయి ప్లీనరీ నిర్వహణకు ఆ పార్టీ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్లీనరీలో చర్చనీయాంశంగా నామినేటెడ్ పదవులపై చర్చ జరగొచ్చని జనసేన వర్గాల్లో వినిపిస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నాయకత్వం వద్ద తమకు తగిన గుర్తింపు లభించడం లేదనే అంశాన్ని లేవనెత్తడం ద్వారా ప్రభుత్వం భర్తీ చేసే నామినేటెడ్ పోస్టుల్లో అగ్రతాంబూలం కల్పించాలనే ఒత్తిడి పెంచనున్నట్టు సమాచారం. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పడి పార్టీ కోసం కష్టపడ్డ కేడర్‌ను కాదని.. ఎన్నికల సమయంలో వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలోకి చేరిన కొందరు నాయకులకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రాధాన్యం కల్పిస్తున్నారంటూ ఇప్పటికే ఆయా కేడర్లు ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నాయి. రాజోలు నియోజకవర్గంలో నిజమైన జనసేన శ్రేణులకు అన్యాయం జరుగుతోందని, వైసీపీ నుంచి వచ్చినవారికే పెద్దపీట వేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వానికి నామినేటెడ్ పోస్టుల భర్తీ కత్తిమీద సాములాగే ఉంది

ఆలయ కమిటీల సందడి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు కమిటీలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే గుర్తింపు పొందిన దేవాలయాలు 1713కు పైగా ఉన్నాయి. అన్నవరం, వాడపల్లి, పిఠాపురం, సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయం, ద్రాక్షారామ, అయినవిల్లి, కోటసత్తెమ్మ, అంతర్వేది, అప్పనపల్లి, రాజమహేంద్రవరంలో కోటిలింగేశ్వరస్వామి, ఉమామార్కెండేయస్వామి వంటి అనేక పెద్ద దేవాలయాలు ఉన్నాయి. గత వైసీపీ హయాంలో ఏం జరిగిందో కానీ రూ.5 లక్షల ఆదాయంకంటే తక్కువ ఉన్న దేవాలయాలకు ట్రస్ట్‌బోర్డుల నియామకం వద్దని అప్పట్లో సుప్రీంకోర్టు ఆర్డర్ ఇచ్చింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో 627 వరకూ ఉంటాయి. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని రూ.5లక్షల్లోపు ఆదాయం ఉన్నవాటిని పరిగణనలోకి తీసుకునేటట్టు కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకుంటే 1713 దేవాలయాలకు కమిటీలను నియమించవచ్చు. ప్రస్తుతం ఐదు లక్షలకంటే ఎక్కువ వార్షికాదాయం ఉన్న సుమారు 590 దేవాలయాలకు మాత్రం కమిటీలను వేసే ఆలోచన జరుగుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో రూ.7.5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం కలవి 127 ఉన్నాయి. ఇవికాకుండా తక్కువ ఆదాయం గలవి 68 వరకూ ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవి 226, రూ.కోట్లలో ఆదాయం ఉన్నవి 19 ఉన్నాయి. మొత్తం అన్ని రకాలు కలిసి 611 ఉన్నాయి. కాకినాడ జిల్లాలో ఐదు లక్షలకంటే ఎక్కువ ఆదాయం కలవి 200, పెద్దవి 11 ఉన్నాయి. అన్ని రకాలు కలిపి 900 ఉన్నాయి. గత నెలలో సీఎం చంద్రబాబు స్వయంగా ఈ కమిటీలకు పేర్లను ప్రతిపాదించాలని ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలకు సూచించిన సంగతి తెలిసిందే. దీంతో సందడి మొదలైంది.

ఏఎంసీలు.. కార్పొరేషన్లు

మార్కెట్ కమిటీల ఛైర్మన్ల పదవులకు ఇప్పటికే రిజర్వేషన్ ప్రక్రియ ప్రకారం ఏయే సామాజిక వర్గానికి ఏయే మార్కెట్ కమిటీ ఇవ్వాలనేది నిర్ణయించారు. దాంతో ఎమ్మెల్యేలు కొంత మందికి ముందుగానే అభయహస్తం ఇవ్వడంతో వారి స్థానే భార్యల పేర్లు గానీ, ఇతరుల పేర్లను ప్రతిపాదించడానికి రకరకాల సమస్యలు ఇబ్బందికరంగా మారాయి. ఇక ప్రభుత్వం కొన్ని కార్పొరేషన్లకు ఛైర్మన్లను నియమించినప్పటికీ డైరెక్టర్లను నియమించకపోవడంతో వాటికి ఆశావహులు పైరవీలు ప్రారంభించారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన కీలక నాయకులు తమకు కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్ల స్థానాలు కల్పించాలంటూ ఒత్తిడి పెంచారు. ఈసారి పదవుల భర్తీలో జనసేనకు ప్రాధాన్యత ఇవ్వకపోతే నియోజకవర్గాల స్థాయిలో ఇబ్బంది వచ్చే పరిస్థితి ఉన్నందున వారిని, అటు బీజేపీని సమన్వయం చేసుకుంటూ పదవులు ఇవ్వాల్సి ఉంది.

నాయకులకు పెను సవాల్..

కీలక దేవస్థానాలకు పాలకమండళ్ల నియామకం సవాళ్లగా మారుతున్నాయి. ఉదాహరణకు కోనసీమ జిల్లాలో వాడపల్లి, అంతర్వేది, అయినవిల్లి, మురమళ్ల, అప్పనపల్లితోపాటు వివిధ ఆలయాలకు పాలకమండళ్లను నియమించడం ఎమ్మెల్యేలకు శిరోభారంగా మారింది. వీటిలో ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గానికి విపరీతమైన డిమాండ్ ఉండడంతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు. ఇదే తరహా పరిస్థితులు అన్ని నియోజకవర్గాల్లోను నెలకొన్నాయి.

ఒక్కో ట్రస్ట్‌బోర్డుకు 11 మంది

ఒక్కో దేవాలయానికి 11 మంది ట్రస్ట్‌బోర్డు సభ్యులను ప్రభుత్వం నియమించనుంది. ఛైర్మన్‌తో పాటు 10 మంది సభ్యులు ఉం టారు. దీనివల్ల వేలాది మంది కార్యకర్తలకు పదవులు దక్కనున్నాయి. మూడు పార్టీల నాయకులు అధిష్ఠానం ఆదేశాల మేరకు పంచుకుంటారు. ఈ సారి ట్రస్ట్‌బోర్డుల్లో 50 శాతం మహిళా సభ్యులను నియమించనున్నారు.ఈసారి కొత్తగా నాయీ బ్రాహ్మణులు ఒకరు, బ్రాహ్మణ వర్గానికి చెందిన వారు ఒకరికి తప్పనిసరిగా స్థానం కలిగించేటట్టు ప్రభుత్వం చట్టం చేసింది.మిగిలిన 50 శాతం జనరల్ కేటగిరీలో ఉంటాయి. ప్రతి కమిటీలోనూ ఆలయ పూజారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు.

మద్యం తాగేవాళ్లకు నో చాన్స్

దేవాలయ ట్రస్ట్ బోర్డు కమిటీల్లో మందుతాగే అలవాటు ఉన్నవారికి అవకాశం లేదు. ముఖ్యంగా హిందువై ఉండాలి. కనీసం 25 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. దేవుడిపై విశ్వాసం ఉండాలి. క్రిమినల్ కేసులు ఉండకూడదు. ఎండోమెంట్ భూములు లీజుకు తీసుకుని ఉండకూడదు. బకాయిలు ఉండకూడదు. వారి బంధువులు లీజుదారులై ఉండకూడదు. ఐపీ పెట్టినవారు, కుష్టువ్యాధిగ్రస్తులూ అనర్హులే. ట్రస్ట్ బోర్డులో సభ్యులెవరికీ గౌరవ వేతనం ఉండదు. ఆలయ అభివృద్ధికి, దేవునికి సేవ చేయడమే ప్రధాన లక్ష్యం.

సౌర.. సా..గు!



- కరెంట్ కష్టం తీరనుంది
- రైతులకు తీపికబురు
- పగటిపూటే 9 గంటలు విద్యుత్
- 176 కోట్లతో సోలార్ ప్లాంట్లు
- తూర్పు, కాకినాడల్లో ఏర్పాటు
- కోనసీమలో స్థల ఇబ్బంది
- ఏటా రూ.275 కోట్లు ఆదా

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాతలకు ఇకపై వ్యవసాయానికి విద్యుత్ బెంగ తీరనుంది. త్వరలో తొమ్మిది గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ వాడుకునే రోజులు రాబోతున్నాయి. ఈ మేరకు ట్రాన్స్‌కో రూ.176 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించబోతోంది. దీని ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కేవలం పగటి పూట రైతులు వాడుకునేందుకు మాత్రమే సరఫరా చేయనుంది. తద్వారా రైతులు విద్యుత్ కోసం రాత్రి వేళల్లో పడిగాపులు కాసే పరిస్థితులు తప్పనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 67 వేల కనెక్షన్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాపై వ్యవసాయంపై ఆధారపడి ఎక్కువ మంది జీవిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు 68 వేల వరకు ఉన్నాయి. సాగుకోసం పక్కాగా విద్యుత్ వినియోగిస్తోన్న కనెక్షన్లు 47 వేలు ఉన్నాయి. వీరికి ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఉమ్మడి జిల్లాకు 2.99 లక్షల కిలోవాట్స్ లోడ్ అవసరం అవుతోంది. అంటే 493.22 మిలియన్ యూనిట్లు. ఈ మొత్తం విద్యుత్ అన్నదాతలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందుకు ఏటా రూ. 275.20 కోట్ల వరకు ఆర్థిక భారం పడుతోంది. ఇంత చేసినా తీవ్ర వేసవి సమయంలో వ్యవసాయానికి సైతం కోతలు వేయాల్సిన పరిస్థితి. దీంతో పలుసార్లు పంటలు ఎండిపోయి అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు.

పోలవరం కాలువ వెంబడి..

ఇకపై సాగుకు విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకూడదనే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో ట్రాన్స్‌కో అధికారులు సోలార్ విద్యుత్‌పై దృష్టిసారించారు. పీఎం కుసుం పథకం కింద సోలార్ విద్యుత్‌ను పగటిపూట తొమ్మిది గంటలపాటు సరఫరా చేయడానికి కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌ను అనుసంధానించి దీన్ని పూర్తిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ విద్యుత్‌కు మాత్రమే సరఫరా చేయాలని నిర్ణయించారు. మొత్తం 44 మెగావాట్ల సామర్థ్యంతో 16 చోట్ల సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం మురారీ నుంచి తుని నియోజకవర్గంలోని తేటగుంట వరకు కాలువ వెంబడి 14 చోట్ల సోలార్ పవర్ ప్లాంట్లను రూ.160 కోట్లతో నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. కాలువ వెంబడి స్థలం ఐదు నుంచి పదెకరాల వరకు ఉన్న చోట్ల 8 మెగావాట్లు, తక్కువ స్థలం ఉన్నచోట్ల రెండు నుంచి నాలుగు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ప్లాంట్లను స్థాపించనున్నారు. రాజమహేంద్రవరంలో కల్వచర్ల, జీవీకే పవర్ ప్లాంట్ ఈ రెండు చోట్ల రూ.8 కోట్లతో నాలుగు మెగావాట్ల సామర్థ్యంలో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించనున్నారు. ఈ సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించి పగటి పూట 9 గంటలపాటు రైతులకు అందించనున్నారు. తద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 48 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు లబ్ధి కలగనుంది. అటు ప్రభుత్వానికి ఏటా ఉచిత విద్యుత్‌కు అయ్యే రూ.275 కోట్లు ఖర్చు ఆదా కానుంది. ఇక కోనసీమ జిల్లాలో రెండు ప్లాంట్ల నిర్మాణానికి ప్రతిపాదనలున్నా స్థల లభ్యత కష్టంగా మారింది. తొలి విడత ఈ రెండు జిల్లాల్లో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే రైతులకు పగటిపూట తొమ్మిది గంటలపాటు ఉచిత విద్యుత్‌కు ఢోకా ఉండదు. సోలార్ విద్యుత్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 47 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు లబ్ధి కలగనుండగా, కాకినాడ జిల్లాలోనే 24 వేల మందిరైతులకు సోలార్‌తో మేలు జరగనుంది.




ఐదు ఎత్తిపోతల పథకాలను బాగు చేయాలి : ముప్పిడి

కొవ్వూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సాగు నీరందిస్తున్న 5 ఎత్తిపోతల పథకాలకు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం మాట్లాడారు.గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఎత్తిపోతల పథ కాలకు సకాలంలో మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరం దించి ఆదుకోవాలన్నారు.కొవ్వాడ కాలువ ఆధునీకరణ చేపట్టాలని కోరారు. కొవ్వూరు రీసర్వే సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబును కలిసి విన్నవించారు.

వివక్ష రూపుమాపేది విద్య

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



గోపాలపురం,మార్చి11 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఆర్థిక అసమా నతలతో పాటు వివక్షను రూపుమాపేది విద్య ఒక్క టేనని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు.అసెంబ్లీలో మంగళవారం మాట్లాడారు.గత పాలకుల అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యాప్రమాణాల్లో నాణ్యత పడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకునే ప్రతి మార్పు పేదల జీవితాల్లో వెలుగు తీసుకొస్తుందన్నారు.

నేడు రైల్వే జీఎం వస్తారు.. ఏం చూస్తారో!

రాజమహేంద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ఈ నెల 12న రానున్న విషయం విదితమే. అయితే ఆయన పర్యటన వస్తారు..వెళ్తారు.. అనే మాదిరిగా సాగనుంది. గతంలో జీఎం తనిఖీలు ఉంటే స్టేషన్ ఆసాంతం పరిశీలించడం జరిగేది.ఉద్యోగుల క్వార్టర్లతో సహా అన్నిటినీ ముస్తాబు చేసేవాళ్ల. ప్రయాణికుల సదుపాయాలు, ట్రాక్‌లు, యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్, పరిశుభ్రత, ఆహారం, ధరలు వంటివి జీఎం, ఆయనతో పాటు ఉండే ఉన్నతాధి కారులు గమనించి తగు చర్యలు తీసుకోవడం ఉండేది. ఇప్పుడు నిధుల కొరత వల్ల భద్రతా పనులకే పరిమిత మయ్యారని అంటున్నారు. దీంతో ఎన్నో నెలల నుంచీ పనిచేయకపోయినా పట్టించుకోకుండా ఇప్పుడు జీఎం వస్తున్నారని ఓ మూడు పరిశుభ్రత యంత్రాలను తీసు కొచ్చి పెట్టారు. బాగానే ఉన్న కుర్చీలను సైతం తీసేసి స్టీలు కుర్చీలు వేశారు. నిధుల కొరత వల్ల ఉన్నంతలో సరిపెట్టారు. వాస్తవానికి ఆయన గత నెల 9న రావాల్సి ఉంది. కానీ కొన్ని పనులు పూర్తి కాకపోవడంతో తేదీ లను పొడిగిస్తూ వచ్చారు. ముఖ్యంగా రాజమండ్రి రైల్వే స్టేషన్‌ని రూ.273 కోట్లతో తీర్చిదిద్దనున్నారు. వీటిని పుష్కరాలకు.. అంటే ఇంకా రెండేళ్లలో ఎట్టి పరిస్థితు ల్లోనూ పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జీఎం రాజమండ్రిలో ఎంత వరకూ సమయం గడుపుతారో అనే సందేహం ఉత్పన్నమవుతోంది. అభివృద్ధి పనుల్లో భాగంగా తూర్పు రైల్వే స్టేషను వైపు భవనానికి జీఎం వచ్చినప్పుడు శంకుస్థాపన చేయించాలని అనుకున్నా అదీ జరిగేట్లు లేదు. ఎందుకంటే అభివృద్ధి పనులు టెండర్ స్థాయిని దాటలేదు. జాంపేట బ్రిడ్జి కింద ప్రాంతంలో ట్రాక్ పనులు పెండింగ్ ఉండడం వల్ల మరో దారిలో ఆయ నను తీసుకెళ్లడానికి ఆలోచన చేశారని తెలుస్తోంది. రాజమండ్రి 10.45 గంటలకు వచ్చి 11.30 గంటలకు వెళతారు. ఏడాదికి ఒకసారి తనిఖీలకు వచ్చే జీఎం కేవలం 45 నిమిషాలు మాత్రమే ఇక్కడ కేటాయించే విధంగా ప్రణాళిక వేశారు.

భద్రతా పనులకే ప్రాధాన్యం - స్టేషన్ పరిశీలన లేనట్లేనట - 45 నిమిషాలే తనిఖీ

నిడదవోలు జంక్షన్ ఆగని రైళ్లతో టెన్షన్

నేడు నిడదవోలుకు రైల్వే జీఎం రాక



నిడదవోలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు రైల్వే జంక్షన్ పేరుకు మాత్రమే.. సూపర్ ఫాస్ట్ రైలు ఎక్కాలంటే ప్రయాణికులు పక్క స్టేషన్‌కు వెళ్లాల్సిందే. స్టేషన్‌కు ఆదాయం బాగానే ఉన్నా రైళ్లు ఆగకుండానే వెళ్లి పోతుంటాయి.నిడదవోలు జంక్షన్ మీదుగా సుమారు రోజుకి 75 రైళ్ళ వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఉన్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు అటు రాజమహేంద్రవరం ఇటు తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లకు వెళ్లి రాకపోకలు సాగిస్తున్నారు.దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గూడ్స్‌ల ద్వారా సంవత్సరానికి సుమారు రూ.12 కోట్లు, ప్రయా ణికుల ద్వారా సంవత్సరానికి సుమారు రూ.15.60 లక్షలు ఆదాయం వస్తుంది. అయితే నిడదవోలు జంక్షన్ మీదుగా ముంబాయి, సికింద్రాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్ళే సూపర్ ఫాస్ట్ రైళ్ళు ఆగడంలేదు. కాకినాడ - లింగంపల్లి (కోకనాడ ఎక్స్‌ప్రెస్), విశాఖపట్టణం - లింగంపల్లి (జన్మభూమి), కాకినాడ - ముంబాయి (సీవో ఎల్‌టి), విశాఖపట్టణం - ముంబాయి (ఎల్‌టీటీ) రైళ్ళకు హాల్ట్‌లు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే జీఎం బుధవారం మధ్యాహ్నం 1.15 నుంచి 2 గంటల వరకు నిడదవోలులో ఆగనున్న నేపథ్యంలో కూ టమి నాయకులు నిడదవోలులో సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్‌ల హాల్ట్‌కు సంబంధించి విన్నవించాలని ప్రజలు కోరుతున్నారు. నిడదవోలు రైల్వే స్టేషన్‌కు కేంద్ర ప్రభుత్వం అమృత భారత్ పథకం ద్వారా సుమారు 27 కోట్ల నిధులు మంజూరు చేసింది.దీంతో ఈ నెలాఖరుకి పనులు పూర్తి చేసే లక్ష్యంతో స్టేషన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.





రాజమండ్రి స్టేషన్‌లో చాలా కాలంగా పారిశుధ్య యంత్రాల్లేవ్.. పాతవాటితోనే కుస్తీపడుతున్నారు.. అయితే బుధవారం జీఎం వస్తున్నారని కొత్తవి తెచ్చిపెట్టారు..

నిందితులు, ఖైదీలకు ఉచిత న్యాయసహాయం

ఎల్‌ఏడీసీ సేవలు వినియోగించుకోవాలి : శ్రీలక్ష్మీ

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ (ఎల్‌ఏడీసీ) సేవలను నిందితులు, ఖైదీలు వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మీ పేర్కొన్నారు. సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక కారాగారాలను మంగళవారం ఆమె సందర్శించారు.ఆహారం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఖైదీలు, వాళ్ల కుటుంబ సభ్యులతో మాట్లాడారు.ఖైదీల తరపున ఉచితంగా వాదించడానికి న్యాయవాదుల ఏర్పాటుకు, బెయిల్ పిటీషన్లు, హైకోర్టుల్లో అప్పీలు చేయడం తదితర న్యాయ సహాయం కోసం డీఎల్ఎస్ఏని సంప్రదించాలన్నారు.జైలులో నియ మించిన పారా లీగల్ వలంటీర్ల ద్వారా అర్జీలను అందజేయాలని సూచించారు. సేవలు ఉచితంగా అందజేస్తారన్నారు.

IndusInd Bank
ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్
1-10-72. 3వ అంతస్తు, అశోకా జనార్దన చాంబర్స్, బేగంపేట, హైదరాబాద్ - 500016

డిఫాల్టర్ రుణగ్రహీత/డైరెక్టర్లు/హామీదారులకు నోటీసు
బలరామ్ ఎంటర్‌ప్రైజెస్, తూర్పు గోదావరి జిల్లా యొక్క యజమాని మరియు హామీదారులు

నమోదిత కార్యాలయం: నం.5/44, కవేరి వీధి, రామాలయం, కొమరిపాలెం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్; (1) శ్రీ పడాల బలరామకృష్ణ రెడ్డి (యజమాని & హామీదారు), నివాసం: ఇ.నం.5/45, కవేరి వీధి, కొమరిపాలెం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్; (2) శ్రీమతి పడాల భాగ్యలక్ష్మి (హామీదారు), నివాసం: ఇ.నం.5/45, కవేరి వీధి, కొమరిపాలెం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్; (3) శ్రీ సతి పోతరెడ్డి (హామీదారు), నివాసం: ఇ.నం.7-448, పిల్లకాలవ వీధి, అనపర్తి పోస్ట్ మరియు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533342, ఆంధ్రప్రదేశ్; (4) శ్రీ సతి వెంపారెడ్డి (హామీదారు), నివాసం: ఇ.నం.7-472, పిల్లకాలవ వీధి, అనపర్తి పోస్ట్ మరియు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533342, ఆంధ్రప్రదేశ్; (5) శ్రీమతి పి. వీరాయమ్మ (హామీదారు), నివాసం: ఇ.నం.5-46, శివాలయం వీధి, బిక్కవోలు మండలం, కొమరిపాలెం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్; (6) శ్రీ పి. బ్రహ్మారెడ్డి (హామీదారు), నివాసం: ఇ.నం.5-46, తేతాలావారి వీధి, బిక్కవోలు మండలం, కొమరిపాలెం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్; (7) శ్రీమతి పి. అనసూయ (హామీదారు), నివాసం: ఇ.నం.5-46, తేతాలావారి వీధి, బిక్కవోలు మండలం, కొమరిపాలెం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్.


పడాల బలరామకృష్ణ రెడ్డి (యజమాని & హామీదారు)


శ్రీమతి పడాల భాగ్యలక్ష్మి (హామీదారు)


శ్రీ సతి పోతరెడ్డి (హామీదారు)

బలరామ్ ఎంటర్‌ప్రైజెస్, బిక్కవోలు, తూర్పు గోదావరి జిల్లా, నమోదిత కార్యాలయం: నం.5/44, కవేరి వీధి, రామాలయం, కొమరిపాలెం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్ వారు ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణం పొందారని మరియు 28.02.2025 నాటికి రూ. 5,69,08,960.56/- (రూపాయలు ఐదు కోట్ల అరవైతొమ్మిది లక్షల ఎనిమిది వేల తొమ్మిది వందల అరవై మరియు యాభైఆరు పైసలు మాత్రమే)లను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారని సమస్త ప్రజానీకానికి ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.

అధీకృత అధికారి, ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్



వారిద్దరూ ఫిజియోథెరపిస్టులే కాదు ఇంద్రజాలికులు కూడా. ఒకరి భావా లను మరొకరు అర్థం చేసుకుంటూ సమాజ చైతన్యానికి ఎంతగానో కృషి చేశారు. డిసెంబరు 26న నిశ్చితార్థం నుంచి మార్చి 12 వివాహ తేదీ వరకు 100 రోజుల పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వంద సేవా కార్యక్రమాలు నిర్వహించి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారు. పేదలకు దుస్తులు, చిన్నారులకు విద్యా సామగ్రి, వైద్య సేవలు అందిస్తూ... చెట్లను పెంచడం వల్ల కలిగే మేలును వివరిస్తూ సామాజిక కార్యక్రమాలు సైతం నిర్వహించారు. వినూత్న రీతిలో వెడ్డింగ్ ప్రోమోలతో ఆకట్టుకుని నేడు పెళ్లి పీటలెక్కుతున్న ఆ యువ జంటే డాక్టర్ మోహిత్-డాక్టర్ సీత.



శతమానంభవతి


కళ్లకు గంతలు కట్టుకుని సైకిళ్లపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న యువ జంట

నిశ్చితార్థం నుంచి పెళ్లి దాకా 'వంద' రోజులు సమాజ సేవ

యువతకు ఆదర్శంగా నిలుస్తున్న ఫిజియోథెరపిస్టుల జంట

నేడు రావులపాలెం సీఆర్సీ వేదికగా మూడుముళ్ల బంధంతో ఒక్కటవుతున్న డాక్టర్ మోహిత్-సీత

ఆత్రేయపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఇంద్రజాలకుడు చింతా శ్యామ్ జాదూగర్ తనయుడు ఫిజియో థెరపిస్టు డాక్టర్ మోహిత్‌కృష్ణ. ఇతడికి బండారులంకకు చెందిన ఉప్పుగంటి శ్రీధర్ కుమార్తె, ఫిజియోథెరపిస్టు డాక్టర్ సాయిసీతతో గతేడాది డిసెంబరు 26న వివాహ నిశ్చితార్థం జరిగింది.

- మోహిత్ మనువాడే సీతకు కూడా ఇంద్రజాలంలో శిక్షణ ఇచ్చారు. వారిద్దరూ బ్లైండ్ ఫోల్డ్... కళ్లపై కరచీనూక వేసుకుని, కళ్లకు గంతలు కట్టుకుని సైకిల్ నడుపుతూ, బైక్ డ్రైవింగ్ చేస్తూ రహదారి భద్రతా నియమాలపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కల్పించారు.
- ఇద్దరూ ఫిజియోథెరపిస్టులు కావడంతో పేద ప్రజలకు ఆధునాతన ఫిజియోథెరపీ శిబిరాలు నిర్వహించి వైద్య సేవలందించారు.
- వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న పేదలు, వలస కూలీలు, వృద్ధులు, అనాథలకు అన్న దానం, వస్త్ర దానం చేయడంతో పాటు పేద చిన్నారులకు విద్యా సామగ్రి అందించారు.
- మొక్కల ప్రాముఖ్యతను తెలియజేస్తూ రూపొందించిన వెడ్డింగ్ కార్డుతో పాటు ఒక మొక్క అందిస్తూ పెళ్లికి ఆహ్వానించారు. సంస్కృతీ, సంప్రదాయాలను కాపాడుతూ సేవా మార్గాన్ని ఎంచుకుని వినూత్న రీతిలో షూట్ చేసిన వెడ్డింగ్ ప్రోమో ఆకట్టుకుంది. కలెక్టర్ మహేష్‌కుమార్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావులకు శుభలేఖలు పంచి సేవా కార్యక్రమాలను వివరించారు.
- రావులపాలెం సీఆర్సీ వేదికపై ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్దల సమక్షంలో మోహిత్-సీత మూడుముళ్ల బంధంతో బుధవారం ఒక్కటవ్వనున్నారు. భవిష్యత్‌లో వీరు మరిన్ని సేవలందిస్తారని ఆశిస్తూ ఆశీర్వదిద్దాం.


కలెక్టర్ మహేష్‌కుమార్‌కు పెండ్లి శుభలేఖతో పాటు మొక్క అందిస్తున్న యువ జంట


పేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తూ...


పేద మహిళకు వస్త్రాలు పంపిణీ చేస్తూ...

సేద్య ప్రయోగశాల



మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ సేద్యంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ ఎప్పటికప్పుడు నూతన సాంకేతిక పద్ధతులను అవలంభిస్తూ అధిక లాభాలు ఆర్జిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాడు. సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని పల్లిపాలేనికి చెందిన రైతు కోట్ల వెంకట శ్రీరామారావు (బుజ్జి) 22 ఎకరాలు సాగు చేస్తూ సేద్యంలో నూతన ఒరవడి సృష్టిస్తున్నాడు.


జీవామృతం తయారు చేస్తున్న రైతు శ్రీరామారావు

నిరంతర ప్రయోగాలతో నూతన ఒరవడి సృష్టిస్తున్న రైతు కోట్ల శ్రీరామారావు

కొబ్బరి తోటలో అంతర పంటల సాగుతో అధిక ఆదాయం

సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులు

(ముమ్మిడివరం-ఆంధ్రజ్యోతి)

కోనసీమ జిల్లాలో రైతులు కొబ్బరి తోటలో మరి ఏ ఇతర పంటలనూ సాగు చేయరు. కేవలం కొబ్బరినే సాగు చేస్తూ ఎకరాకు సంవత్సరానికి సేద్యపు ఖర్చులు పోను రూ.20వేల నుంచి రూ.30వేల వరకు ఆదాయం పొందుతారు. అయితే బుజ్జి మాత్రం కొబ్బరి తోటలో అంతర పంటలుగా ఖోఖో, వక్క, వాక్కాయ (చెర్రీ), పోకచెట్టు, మిరియాలు, గుమ్మడి టేకు, టేకు, మహాగని, అకేషియా మాంజ్యం వంటి కలపనిచ్చే వృక్షాలు సాగు చేస్తున్నాడు. దీనివల్ల కొబ్బరి చెట్లు అధిక దిగుబడి ఇవ్వడంతో పాటు అంతర పంటల వల్ల ఎకరాకు రూ.80వేల దాకా అదనపు ఆదాయం పొందుతున్నాడు.

తోటలో మొక్కలకు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం సేంద్రియ ఎరువులను వాడుతూ సత్ఫలితాలు సాధిస్తున్నాడు. సేంద్రియ ఎరువులను కూడా సొంతంగానే తయారు చేసివినియోగిస్తుంటాడు. పొలంలో పచ్చిరొట్ట సాగు చేసి ఎదిగిన తర్వాత వాటిని దుక్కి దున్నుతాడు. దీనివల్ల భూసారం పెరుగుతుంది. కొబ్బరి తోటలో ఆకులు, కమ్మలు వంటి వాటిని గోతులుగా తీసి వాటిలో వేసి సేంద్రియ ఎరువును తయారు చేస్తాడు. వీటితో పాటు జీవామృతం చేసి వాటిని పొలంలో వెళ్లే సాగునీటిలో కలిసి సేంద్రియ ఎరువుగా వాడుతున్నాడు. దీని కోసం పొలంలో 500 సిమెంటు కుండీలు ఏర్పాటుచేసి ఒక్కో కుండీలో 25 కిలోల దేశవాళీ ఆవుపేడ, 25 లీటర్ల గో మూత్రం, రెండు కిలోల పుట్టమట్టి, 5 కిలోల బెల్లం, 5 కిలోల శనగపిండి కలిపి రెండు రోజులు నానబెట్టి సవ్యదిశలో ఉదయం రెండుసార్లు, సాయంత్రం రెండుసార్లు కలిపి రెండు రోజుల తర్వాత సాగునీరు వెళ్లే బోదె ద్వారా జీవామృతం వదులుతాడు. దీనివల్ల ఒక గ్రాము పేడలో ఉండే పది లక్షల బ్యాక్టీరియా కోటికి పెరుగుతుంది. తద్వారా నాలుగు అడుగుల లోతు ఉన్నవానపాములు పైకి వచ్చి వ్యర్థాలను కంపోస్టుగా మారుస్తాయి. ఏ విధమైన రసాయనాలు వాడాల్సిన అవసరం లేదు.

చెట్లకు వచ్చే తెగుళ్ల నివారణకు పోషక లోపాలను అధిగమించేందుకు జీవన ఎరువులు వినియోగిస్తుంటారు. అజా పెరిలీయం, పాస్కో బ్యాక్టీరియా, పొటాష్ మొబలైజర్, బోరాన్, మెగ్నీషియం, టీయూడీ, సుడోమోనాస్ వంటి వాటిని వినియోగించి తెగుళ్లు, పోషక లోపాలను సమర్థవంతంగా నివారిస్తారు. పొలంలో గిరి ఆవులు, పుంగనూరు ఆవులు వంటి వాటిని పశుపోషణ కూడా సాగిస్తున్నారు. వీటికి తోడు నాటు కోళ్ల పెంపకం ద్వారా తోటలో ఎరువును తయారు చేస్తున్నాడు.


కోకో కాయలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు డాక్టర్ కిరీటి, డాక్టర్ గోవర్ధన్


కొబ్బరి తోటలో అంతర పంటగా ఖోఖో, ఇతర పంటలు


2021లో అప్పటి మంత్రి కురసాల కన్నబాబు నుంచి అవార్డు అందుకుంటున్న బుజ్జి

ఆ ఇల్లు సుందర వనం...

ఇంటి ఆవరణలో రకరకాల పండ్ల చెట్లు, పవిత్ర వృక్షాలు, ఫలాలనిచ్చే వృక్షాలు, కూరగాయలు వంటివి సాగుచేస్తున్నాడు. మారేడు, తెల్ల జిల్లేడు, కబందం, మోదుగ, మర్రి, జమ్మి, రావి, వేప, మహాబిల్వం, రుద్రాక్ష, రాఖీ, గులాబీ, సింగపూర్ విజ్జోరా, ఆర్కిడ్స్, బార్బడస్ చెర్రీ, స్టార్ ఫ్రూట్, జామ, అవకాడో, మలబారు, రామాఫలం, సీతాఫలం, లక్ష్మణఫలం, హనుమాన్ ఫలం వంటి వాటితో పాటు అల్ల నేరేడు, కాటన్‌దొర నేరేడు, థాయ్‌లాండ్ పనస, సీమచింత, రుధిరచింత, వెలగ వంటి వాటిని సాగుచేసి ఆదాయం ఆర్జిస్తున్నాడు. ఇంటి ఆవరణలో ఉన్న మామిడి చెట్లు సక్రమంగా ఫలాలను ఇవ్వకపోవడంతో వాటి కొమ్మలను కటింగ్ చేసి ఎనిమిది రకాల మామిడి అంట్లను కట్టి మామిడిపండ్లను పొందుతున్నాడు. ఒకే చెట్టుకు పెద్ద రసాలు, కొత్తపల్లి కొబ్బరి, ముంతమామిడి, పాపారాజగోవా, చిన్నరసాలు, సువర్ణరేఖ, తెలుపురసం, బంగినపల్లి వంటి వాటిని అంట్లుగా కట్టడంతో అవి ఫలాలు ఇస్తున్నాయి.



- సాగులో సత్ఫలితాలు సాధిస్తున్న బుజ్జి 2013లో జిల్లా ఉత్తమ ఖోఖో రైతు, 2021లో రాష్ట్ర ఉత్తమ కొబ్బరి రైతు అవార్డు అందుకున్నారు.
- వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్శిటీ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.
- బుజ్జి కొబ్బరితోటలో సేంద్రియ ఎరువులు, అంతర పంటల సాగును వీక్షించేందుకు యూనివర్శిటీ విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శనకు వస్తుంటారు. సాగులో అనుభవాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటారు.

గరుడ వాహనంపై నరసన్న విహారం

వైభవంగా కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు


గరుడవాహనంపై నరసింహ స్వామి గ్రామోత్సవం



కోరుకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజైన మంగళవారం స్వామి వారిని కొండ పైన, దిగువన అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామికి ఆరాధన, సర్వదర్శనం, గ్రామ బలిహరణ, సేవాకాలం నిర్వహించారు. అలాగే స్వామి వారి కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది.

గరుడ వాహనంపై గ్రామోత్సవం

నరసన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి 8గంటలకు స్వామి వారిని గరుడ వాహనంపై ఆశీనులను చేసి గ్రామోత్సవం చేశారు. ఆగమ బ్రహ్మ పాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశిక అర్చక స్వాముల పర్యవేక్షణలో వైకానస ఆగమం, శ్రీ వైష్ణవ సాంప్రదాయం ప్రకారం గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్చారణల మధ్య అనువంశిక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, పరాసర లక్ష్మీనరసింహభట్టర్, పరాసర రఘునాథ భట్టర్‌లు గరుడ వాహనంపై ఆశీనులైన స్వామి వారికి మంగళ నీరాజనాలు పాడారు. భక్తులు పండ్లు ఫలహారాలు నివేదించారు.

నేటి కార్యక్రమాలు

- ఉదయం కొండపైన, దిగువన భక్తుల కోసం నరసింహ స్వామి సర్వదర్శనం
- రాత్రి 7గంటలకు స్వామి వారి ముఖ మండపంలో వేద పండితుల సమక్షంలో స్వామి వారికి సదస్యం
- స్వామి వారి కళావేదికపై కూచిపూడి నృత్య ప్రదర్శన
- ధర్మ సత్రంలో ఉచిత అన్నదానం
- రంగరాజస్వామి ఆలయం వద్ద ఆధ్యాత్మిక పండిత సభలు
- రాత్రి 9గంటలకు ఆంజనేయ స్వామి వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం

ముత్యాలు ఏమయ్యాయి!

- కళ్యాణానికి ముందే పోశామని అంటున్న దేవస్థానం అధికారులు
- తమకు ఇవ్వలేదంటున్న భక్తులు
- రెండు రోజుల్లో భక్తులందరికీ పంపిణీ చేయాలని ఎమ్మెల్యే బత్తుల ఆదేశం

కోరుకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): చారిత్రాత్మక కోరుకొండ శ్రీ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా దాతలు స్వామి వారి కల్యాణ సమయంలో తలంబ్రాలు వాడమని సుమారు రూ.1 లక్ష విలువ చేసే ముత్యాలను దేవస్థానానికి అందజేశారు. మరో దాత, కోరుకొండ పంచాయతీ వారు, ఇతర భక్తులు స్వామి వారి కల్యాణంలో తలంబ్రాలుగా వాడమని ముత్యాలు సమర్పించారు. అయితే సోమవారం రాత్రి స్వామి వారి కల్యాణం అనంతరం భక్తులు ఎవరికీ స్వామి వారి తలంబ్రాల బియ్యం, ముత్యాలు అందజేయకపోవడంతో అదే కల్యాణంలో ఉన్న ఎమ్మెల్యే బత్తులబలరామకృష్ణకు భక్తులు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆలయ అర్చకులను, అన్నవరం దేవస్థానం అధికారులను ప్రశ్నించారు. అయితే కల్యాణానికి ముందే స్వామి వారికి ముత్యాల తలంబ్రాలు పోశామని చెప్పడంతో అక్కడున్న భక్తులు, ప్రజాప్రతినిధులు అవాక్కయ్యారు. కల్యాణం జరగకుండానే తలంబ్రాలు ఎలా పోశారని ప్రశ్నించారు. భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దని నరసన్న కల్యాణంలో వాడిన తలంబ్రాలను ముత్యాలను భక్తులందరికీ రెండు రోజుల్లో పంపిణీ చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఇదిలా ఉండగా 300 మందికి పైగా భక్తులు రూ.1116 చొప్పున చెల్లించి కల్యాణం టిక్కెట్లు కొనుగోలు చేశారు. వారికి కనీసం కూర్చోవడానికి స్థలం కూడా లేదని, కొందరిని కల్యాణం జరిగే హాల్‌లోకి కూడా రానీయలేదని భక్తులు ఆరోపించారు. అంతేకాకుండా టిక్కెట్లు కొనుగోలు చేసి కల్యాణం చేయించుకున్న వారికి అందజేసిన లడ్డూ ప్రసాదం ఈ సంవత్సరం నాసిరకంగా ఉందని, పరిమాణం కూడా తగ్గిందని భక్తులు చెబుతున్నారు. కల్యాణ లడ్డూలు, ముత్యాల తలంబ్రాలపై సమగ్ర విచారణ జరిపించాలని భక్తులు డిమాండ్ చేశారు.

ఏప్రిల్ 7 నుంచి వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలు

- అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలి
- కలెక్టర్ మహేష్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి తీర్థ కల్యాణ మహోత్సవాలు ఏప్రిల్ 7నుంచి 13వరకు జరుగుతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల మాదిరిగా అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం వాడపల్లి కల్యాణోత్సవాల సన్నద్ధతపై దేవదాయ, పోలీసు, రెవెన్యూ, ఇతర లైన్ డిపార్టుమెంట్ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 7న ధ్వజావరోహనం, 8న స్వామివారి తీర్థం, రథోత్సవం, కల్యాణం నిర్వహిస్తారన్నారు. 9న పొన్న వాహన సేవ, 11న గోదావరినదిలో తెప్పోత్సవం, 12న మహాపూర్ణాహుతి, చక్రస్నానం కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దేవదాయ ధర్మాదాయశాఖ భక్తుల సౌకర్యార్థం పోలీసుల పర్యవేక్షణలో పటిష్టమైన క్యూలైన్లను ఏర్పాటు చేయాలని, ఎక్కడా తొక్కిసలాటకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులకు, వృద్ధులకు, గర్భిణులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తూ అందరికీ వినిపించే విధంగా సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడపాలని, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ట్రాన్స్‌కో అధికారులకు సూచించారు. ఆర్డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో తగినన్ని తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయడంతో పాటు రక్షిత మంచినీటిని అందించాలన్నారు. పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుధ్య వ్యవస్థను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. తెప్పోత్సవానికి గోదావరి నదిలో బోట్లు, గజ ఈతగాళ్లను ఏర్పాటుచేయాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, దేవస్థానం కార్యనిర్వహణాధికారి చక్రధరరావు, అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ, ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, తహశీల్దార్ రాజేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నన్నయ వీసీకి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

ప్రదానం చేసిన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ


తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీకి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో గ్లోబల్ ఏంజెల్స్ జేసీటీ సహకారంతో ప్రతిష్ఠాత్మక హెచ్‌ఎంటీవీ మాతృశక్తి అవార్డు-2025 కార్యక్రమంలో వీసీ ప్రసన్నశ్రీకి తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ అవార్డును అందజేశారు. ఈ సదస్సులో నిర్వాహకులు వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ గురించి ప్రస్తావిస్తూ అంతరించిపోతున్న 19 గిరిజన భాషలకు లిపిని రూపొందించిన ప్రముఖ విద్యావేత్త అని, విద్యారంగంలో చేసిన కృషికి కేంద్ర ప్రభుత్వం నారీశక్తి పురస్కారాన్ని అందించిన విషయాన్ని గుర్తుచేశారు. తెలుగు రాష్ట్రాల్లో వైస్ చాన్సలర్ బాధ్యతలు స్వీకరించిన తొలి తెలుగు గిరిజన మహిళగా గుర్తింపు పొందారని, విద్యార్థులకు వసతి గృహంలో అందిస్తున్న భోజనం రుచిగా, శుచిగా ఉండాలని సూచిస్తూ, విద్యార్థులకు గోరుముద్దలు తినిపించి సొంత బిడ్డల్లా ఆదరిస్తున్నారంటూ ప్రసన్నశ్రీని ప్రశంసించారు. అనంతరం ఆమెకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సత్కరించి, అవార్డును ప్రదానం చేశారు.

వైద్య ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

డీసీహెచ్‌ఎస్ డాక్టర్ పద్మశ్రీ రాణి

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా వైద్యసేవల సమన్వయాధికారిణి డాక్టర్ ఎన్‌పీ పద్మశ్రీ రాణి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ల్యాబ్ టెక్నీషియన్ -1, ఆడియొ మెట్రీషియన్-2 పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్టు తెలిపారు. అలాగే, బయో స్టాటిస్టీషియన్-1, థియేటర్ అసిస్టెంట్-1, జనరల్ డ్యూటీ అటెండెంట్-22, ఆఫీస్ సబార్డినేట్-3 పోస్టులను అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన ఒక ఏడాది కాలానికి భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేసినట్టు చెప్పారు. ఆయా పోస్టులకు దరఖాస్తులను ఈస్ట్‌గోదావరి.ఎన్‌ఐసీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి పొందాలని, పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 13వ తేదీ నుంచి 21వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (ప్రభుత్వాసుపత్రి క్యాంపస్) జిల్లా వైద్యసేవల సమన్వయాధికారి కార్యాలయంలో అందజేయాలని పేర్కొన్నారు.

లక్ష్మీగణపతికి మూడు వేల పెన్నులతో పూజలు


బిక్కవోలులో పెన్నులతో పూజలందుకున్న లక్ష్మీగణపతి

బిక్కవోలు, మార్చి 11(ఆంధ్రజ్యోతి): బిక్కవోలులోని ప్రాచీన లక్ష్మీగణపతికి మంగళవారం మూడు వేల పెన్నులతో పూజలు చేశారు. ఈ పెన్నులను హైదరాబాద్‌కు చెందిన ఆకెళ్ల సత్యసూర్యనారాయణమూర్తి పద్మావతి దంపతులు బహూకరించారని ఆలయ ఈవో ఆకెళ్ల భాస్కర్ తెలిపారు. పూజలనంతరం వీటిని మండలంలో పదోతరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు అందజేస్తామని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పాలచర్ల వెంకటశివప్రసాద్‌చౌదరి, గొర్రెల త్రిమూర్తులు, ఆలయ సిబ్బంది ప్రసాద్, రవి, ఈశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రావు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి ప్రస్తుత ఉద్యోగులకు ఐఆర్‌ను ప్రకటించాలని ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వలిశెట్టి దామోదర్‌రావు కోరారు. రాజమహేంద్రవరంలో మంగళవారం జరిగిన ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా రెండో నిర్మాణ మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు ఆదేశాలు జారీ చేయాలని, అన్ని కేడర్ ఖాళీలను రెగ్యులర్ ఉద్యోగులతో భర్తీ చేయాలన్నారు. విజయవాడ జోనల్ కార్యదర్శి వైఎస్ రావు మాట్లాడుతూ జిల్లాలోని కొందరు అధికారులు ఎంప్లాయీస్ యూనియన్ పట్ల వివక్షతతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గోకవరం డిపోలో సూపరింటెండెంట్ ట్రాఫిక్ వారు ఉద్యోగులను వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా సీహెచ్‌వీ ప్రకాష్‌బాబు, గిడ్ల చిరంజీవిలను ఎన్నుకున్నారు.

భారీ స్థాయిలో జనసేన సభ

మంత్రులు నాదెండ్ల, దుర్గేష్



చిత్రాడ శివారులోని ఎస్‌బీ వెంచర్స్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రులు, జనసేన నాయకులు

కలెక్టరేట్(కాకినాడ)/పిఠాపురం రూరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన కాకినాడ జిల్లా పిఠాపురం నియోజ కవర్గం లోని చిత్రాడ గ్రామంలో నిర్వహి ంచనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభకు భారీఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ సభకు లక్షలాది మంది జనసైనికులు హాజరవు తారని రాష్ట్ర పౌరసరఫ రాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. మంగళవారం జనసేన పార్టీ ఆధ్వర్యంలో స్థానికంగా విలేకరులతో సమావేశాన్ని నిర్వహించి ఆవిర్భావ సభ ఏర్పా ట్లను వివరించారు. ఈ సందర్భంగా మంత్రులు నాదెండ్ల, కందుల మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వంలో ఉండి ఈ సభను నిర్వహిస్తున్నామని, దీనికి అధిక సంఖ్యలో హాజరవ్వడానికి తగు ఏర్పాట్లు చేస్తున్నామన్నా రు. సభ ప్రాంగణంతోపాటు పలుచోట్ల వైద్య శిబిరాలు, తాగునీరు, భోజన సదుపాయం, ఎల్ఈడీ స్ర్కీన్స్, మరుగు వంటివి ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న జనసేన అధినేత పవన్ అభిమానులు, జనసైనికులు ఈ సభకు లక్షల్లో హాజరవుతారన్నారు. ఈనెల 12న వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టే యువత పోరుపై వారు స్పందించారు. యువతతోపాటు రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసిన జగన్ ఇప్పుడు ఫీజుపోరు అంటూ కొత్త నాటకానికి తెరలేపారన్నారు. రాష్ట్రం నాశనం అవ్వడానికి జగన్ వైఖరి కారణ మన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, పత్సమట్ల ధర్మరాజు, నాయకులు తలాటం సత్య, చోడిశెట్టి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సభా ఏర్పాట్ల పరిశీలన

పిఠాపురం మండలం చిత్రాడ శివారులోని ఎస్‌బీ వెంచర్స్‌లో జరిగే జనసేన ఆవిర్భావ సభ ఏర్పాట్లును రాష్ట్ర పౌరసరఫరాలు, పర్యాటక శాఖామంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంగళవారం సాయంత్రం పరిశీలిం చారు. సభావేదిక, ప్రాంగణంలో జరుగుతున్న పనులు, బారికేడ్ల నిర్మాణం, గ్యాలరీల ఏర్పా ట్లను పరిశీలించి పనుల నిర్వహణపై సూచ నలు ఇచ్చారు. కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, శాసనమండలి ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, కార్యక్రమాల నిర్వహణ కమిటీ చైర్మన్ కల్యాణం శివశ్రీనివాసరావు, డీకే చైతన్య, పలు వురు ఎమ్మెల్యేలు,జనసేన నాయకులు ఉన్నారు.

జనసేన ఆవిర్భావ సభకు విస్తృత బందోబస్తు

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

పిఠాపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జన సేన పార్టీ ఆవిర్భావ సభకు వచ్చేవారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా విస్తృత బందో బస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ వెల్లడించారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం చిత్రాడ శివారు ఎస్‌బీ వెంచర్స్ ఆవరణలో ఈనెల 14న జరిగే జనసేన ఆవిర్భావ సభ వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ బిందుమాధవ్, జనసేన నాయకులతో కలిసి ఆయన మంగళవారం పరిశీలన జరిపారు. సభా ప్రాంగణం, హెలిపాడ్, వేదిక, గ్యాలరీలు, సభలోకి వచ్చేందుకు ఏర్పాటు చేసిన మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు గుర్తించిన ప్రాంతాలను పరిశీలించి అక్కడ జరుగుతున్న పనులపై ఆరా తీశారు. అనంతరం ఐజీ విలేకర్లతో మాట్లాడా రు. ఏలూరు రేంజ్ పరిధిలోని అన్ని ప్రాంతాల నుంచి పోలీసులను బందోబస్తు నిమిత్తం విని యోగిస్తామని, 1,700 నుంచి 2వేల మందితో భద్రత కల్పిస్తామని తెలిపారు. కాకినాడ జిల్లా ఎస్పీ బందోబస్తును పర్యవేక్షిస్తారని, అవసర మైతే అదనపు బందోబస్తు ఏర్పాటుతో పాటు అధికారులను నియమిస్తామని వివరించారు. సభకు 1.5 లక్షల నుంచి 2లక్షల మంది కార్యక ర్తలు, నాయకులు వస్తారని భావిస్తున్నామని, అంతకంటే అధికంగా వచ్చినా అందుకు తగ్గ ట్టుగా ఏర్పాట్లు ఉండాలని సూచించినట్టు తెలి పారు. సభకు వచ్చేవారిని నేరుగా గ్యాలరీల్లోకి పంపడం, వీవీఐపీలు, వీఐపీలు, మహిళలు ఎటువంటి ఇబ్బంది లేకుండా నేరుగా వారి గ్యా లరీల్లోకి వెళ్లే విధంగా చూస్తామని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ వచ్చేందుకు ఏర్పాటు చేసిన హెలిపాడ్‌ను పరిశీలించామని, ఆయన పర్యటన వివరాలకు అనుగుణంగా బందోబస్తు ఉంటుందని తెలిపారు. కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, పెద్దాపురం ఎస్‌డీపీవో శ్రీహరిరాజు, ఏపీ టిడ్కో చైర్మన్ వేములపాటి అజయకుమార్, జనసేన పిఠాపురం నియోజక వర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఉన్నారు.



చిత్రాడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ, జనసేన నేతలు

ఐవీఆర్ఎస్ సర్వేలో రెండవస్థానానికి

'అన్నవరం'

పారదర్శకంగా సీఆర్వోలో గదుల కేటాయింపు, దర్శన సమయంతో ర్యాంక్ మెరుగు

అన్నవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రముఖ ఆలయాల్లో భక్తు లకు అందుతున్న సౌకర్యాలపై చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేలో కాకినాడ జిల్లాలోని అన్నవరం దేవస్థానం గత నెల కంటే ఆరు స్థానాలు మెరుగుపరుచుకుని రెండో స్థానా నికి ఎగబాకింది. గత నెలలో చివరిస్థానం లో ఉన్న అన్నవరం దేవస్థానంలో జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ క్షేత్రస్థాయిలో పరిశీ లించి పలు సూచనలు చేయడం, దేవ స్థానం ఈవో సుబ్బారావు ర్యాంకింగ్ మెరు గుపరచడం కోసం సిబ్బందికి సూచనలు చేయడం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ర్యాం కింగ్ మెరుగుపడేందుకు దోహదం చేశా యి. దీంతో పాటుగా సీఆర్వో కార్యాలయం లో భక్తులకు గదుల కేటాయింపు పారదర్శ కంగా ఉండడంతో భక్తులు సంతృప్తి వ్య క్తం చేస్తున్నారు. ప్రోటోకాల్ మెసేజీలలో ముఖ్యమైనవి రాత్రి 9గంటల వరకు వేచి చూసి ఎవ్వరూ రాకుంటే వాటిని సైతం సాధారణ భక్తులకు కేటాయిస్తున్నారు. స్వామివారి దర్శనం, అన్నదానం క్యూలైన్ లలో భక్తులు ఎక్కడా నిరీక్షణ లేకుండా త్వరితగతిన పూర్తిచేసుకుంటున్నారు. తరు వాత నెల సర్వేలో మొదటిస్థానం సాధిం చేందుకు కృషి చేస్తానని ఈవో సుబ్బారావు ఆంధ్రజ్యోతికి తెలిపారు. రెండవ నెల సర్వేలో సింహాచలం దేవస్థానం మొదటి స్థానం సాధించింది.

స్కూల్ బస్సు బోల్తా

నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలు

ఆరుగురికి స్వల్ప గాయాలు



కాండ్రేగులలో బోల్తా పడిన స్కూల్ బస్సు



బాధితులను పరామర్శిస్తున్న జ్యోతుల నవీన్‌కుమార్

జగ్గంపేట రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యో తి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాం డ్రేగులలో ఓ ప్రైవేట్ స్కూల్ బోల్తాపడింది. జగ్గంపేటలోని ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన బస్సు మంగళవారం కాండ్రేగుల నుంచి జగ్గం పేటకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయా లు కాగా ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 13 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు తెలుస్తుం ది. వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. స్వల్ప గాయాలైన ఆరుగురు విద్యార్థులను ప్రథమ చికిత్స అనం తరం ఇంటికి పంపించేశారు. తీవ్ర గాయాలైన నలుగురిని రాజమండ్రి ప్రైవేట్ ఆసుపత్రికి తర లించి చికిత్స అందిస్తున్నారు. తీవ్ర గాయాలైన వారిలో తోటకూర కార్తీక్ నాగేంద్ర, తోటకూర అనిత రామచక్ర, ద్వారపూడి ధనలక్ష్మి, బొదిరెడ్డి శ్రావణిగా ఉన్నారు. విద్యార్థులంతా 6 నుంచి 9 తరగతిమధ్య చదువుతున్నారు. విషయం తెలు సుకున్న వెంటనే జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఆసుపత్రికి వెళ్లి విద్యా ర్థులను పరామర్శించారు. ప్రమాద వివరాలను అడిగి తెలుసుకుని మెరుగైన వైద్యం అందించా లని డాక్టర్లకు సూచించారు. విద్యార్థులను జగ్గం పేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్, ఎమ్మార్వో జేవీఆర్ రమేష్ పరామర్శించారు. బుదిరెడ్డి రాంబాబు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ రఘునాధరావు తెలిపారు.

కుటుంబ గొడవల నేపథ్యంలో...

పేలుడు పదార్థాలతో దాడి

మద్యంసీసాకు నారబాంబు అతికించి వెలిగించిన వైనం

సీసాపెంకులు చెల్లా చెదురు... తప్పిన ప్రమాదం



రోడ్డుపై పడి ఉన్న మద్యం సీసా,పేలిన నారబాంబు

ద్రాక్షారామ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కుటుంబ గొడవల నేపథ్యంలో కోనసీమ జిల్లా ద్రాక్షారామలో నున్నవారి వీధికి చెందిన మహ మ్మద్ జాఫర్, అతడి కుమారుడుపై సోమవా రం అర్ధరాత్రి అదే గ్రామానికి చెందిన మైనరు బాలుడు మరో ఇద్దరు వ్యక్తులు పేలుడు పదా ర్థాలతో దాడికి పాల్పడిన ఘటనపై ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ద్రాక్షారామకు చెందిన మహమ్మద్ జాఫర్ ద్రాక్షారామలో మటన్ వ్యాపారం చేస్తుంటాడు. నున్నవారి వీధిలో సోమవారం రాత్రి భోజనం చేసి తన కుమారుడితో కలసి రేకుల షెడ్డులో నిద్రించాడు. అర్ధరాత్రి 1.00 సమయంలో పెద్ద పేలుడు సంభవించింది. దీంతో లేచి చూడగా మైనరు బాలు డితో పాటు మ రో ఇద్దరు మోటా రు సైకిల్‌పై పా రిపోవడం గుర్తిం చాడు. బయటకు వచ్చేసరికి పేలుడు దాటికి మంటలు చెలరేగి ప్రహరీగా కట్టుకున్న క్లాత్ కొంతమేర కాలిపో యింది. దుప్పట్లు కాలిపోయాయి. మద్యం సీసా పెం కులు చెల్లాచెదురుగా పడిఉ న్నాయి. రోడ్డుపై మద్యం సీసా, పేలిన నార బాంబు గుర్తించారు. దీంతో మహమ్మద్ జాఫర్ ద్రాక్షారామ పోలీసులకు పిర్యాదు చేశారు. సీఐ ఎం.వెంకట నారాయణ, ఎస్ఐ ఎం.లక్ష్మణ్‌తో కలసి సంఘటనా స్థలాన్ని పరి శీలించారు. దర్గా వద్ద మైనరు బాలుడు కుటుం బం, జాఫర్ కుటుంబానికి మ ధ్య గొడవ జరిగి న నేపథ్యంలో తనను చంపేందుకు పేలుడు పదార్థాలతో దాడి చేసినట్టు జాఫర్ పోలీసులకు ఇచ్చిన పిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటనా స్థలం వద్ద పరిశీలిస్తే 2మద్యం సీసాల్లో పెట్రోల్ పోసి సీసాలకు నార బాంబులు అతి కించి వారికి సమీపంలో గోడపై పెట్టి కాల్చినట్టు అనుమానిస్తున్నారు. దీంతో పేలుడుకు దుప్ప ట్లు, పహరీగా కట్టుకున్న గ్రీన్ క్లాత్ కాలినట్టు చెబుతున్నారు. ఒక మద్యంసీసా పగిలిపోగా మరొకటి రోడ్డుపైన పడి ఉంది. ఒక సీసా మాత్రమే పగలడం, దుప్పట్లు కప్పుకుని నిద్రిస్తుండటంతో ప్రమాదం తప్పింది.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మణ్

గుర్తు తెలియని మహిళను సంరక్షించిన పోలీసులు



మహిళ

రాయవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమే శ్వరం గ్రామంలో అనుమానా స్పదంగా తిరుగుతున్న మహి ళను గుర్తించిన గ్రామస్థులు మంగళవారం రాయవరం పో లీసులకు సమాచారం అందించగా వారు సంరక్షించారు. మహిళ ఆచూకీ కోసం పోలీ సులను సంప్రదించాలని రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. మహిళను వివ రాల కోసం ఆరాతీయగా ఆమె నుంచి ఏ స మాధానం రాకపోవడంతో రామచంద్రపురం న్యూఫౌండేషన్ ఆశ్రమంలోచేర్పించామన్నారు.

యువతి అదృశ్యంపై కేసు



విజయలక్ష్మి (ఫైల్‌ఫొటో)

వై.రామవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా వై.రామవరం మండలం లోత ట్టు ప్రాంతమైన చింతలపూడి పంచాయతీ బొడ్డగుంట గ్రా మానికి చెందిన కత్తుల విజ యలక్ష్మి అనే గిరిజన యువతి అదృశ్యంపై మంగళవారం వై.రామవరం పోలీ స్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. విజయలక్ష్మి జనవరి 4న ఇంటి నుంచి బయలుదేరి మా రేడుమిల్లి సంతకు వెళ్లిందని, అప్పటి నుంచి ఇంటికి రాకపోవడంతో పలుచోట్ల వెతికి ప్ర యోజనం లేక ఆమె తల్లి సుబ్బలక్ష్మి ఫిర్యాదు చేసిందని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేశామని, సమాచారం తెలిస్తే 944 0904361కు సమాచారం ఇవ్వాలని కోరారు.

హోంగార్డుకు పూర్వ విధులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్ర జ్యోతి): ఓ హోంగార్డుపై ఎస్ఐ దాష్టీకానికి పాల్పడడంపై 'ఆంధ్రజ్యోతి'లో 'హోంగార్డుపై ఎస్ఐ ప్రతాపం' శీర్షికన మంగళవారం వార్త వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై అధి కారులు స్పందించారు. అతడిపై భౌతిక దాడి కి దిగడంతోపాటు విధులకు కూడా భంగం కలిగించడంపై ఆత్మ పరిశీలన చేసుకున్నారు. ఈ ఘటన జరగక ముందు ఉన్న విధులకు ఆయనను పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశా రు. అయితే కనీసం ప్రాథమిక ఆరా లేకుండా చిన్నస్థాయి ఉద్యోగిని చితకబాది, ప్రభుత్వా స్పత్రిలో మెడికో లీగ్ కేసు కూడా నమోదు కాకు ండా అడ్డుపడిన సీఐ, ఎస్ఐ, కాని స్టేబుళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఐజీ, ఎస్పీకి హోంగార్డులు విన్నవిస్తున్నారు.

2600 లీటర్ల బ్లాక్ ఆయిల్, 750 లీటర్ల డీజిల్ ఆయిల్ స్వాధీనం

గోపాలపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో ఏఎంసీ కార్యాలయంలో మంగళవారం పీడీఎస్ బియ్యం బహిరంగ వేలానికి జిల్లా పౌరసరఫ రాల శా ఖాధికారి నాగాంజనేయులు తిరిగి వెళ్తుండగా మార్గమధ్యలోని గోపాలపురం శివారులో ఉన్న పొగాకు బోర్డు ఎదురుగా అనధికారికంగా నిల్వ ఉంచిన డీజిల్, బ్లాక్ ఆయిల్, నిల్వలను సివిల్ సప్లై డీటీలతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశా రు. 2600 బ్లాక్ ఆయిల్, 750 లీటర్ల డీజిల్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాలశాఖ నిబంధనలు ఉల్లంఘించి అక్రమ వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అందులో భాగంగానే గోపాలపురం శివారులో అక్రమ ఆయిల్ వ్యాపా రం జరుగుతుందన్న సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టామన్నారు. 750 లీటర్ల డీజిల్, 2600 లీటర్ల బ్లాక్‌ఆయిల్ స్వాధీనం చేసుకుని అక్రమ వ్యాపారం చేస్తున్న వ్యక్తిపై 6ఏ కేసు నమోదు చేసినట్టు తెలి పారు. స్వాధీనం చేసుకున్న ఆయిల్ సమీపంలో ని పెట్రోల్‌బంకు యాజమాన్యానికి అప్పగించి పర్యవేక్షించాలని ఆదేశించారు. నిడదవోలు, దేవ రపల్లి, నల్లజర్ల, గోపాలపురం డీటీలు ఉన్నారు.

తమ్మయ్యబాబుతో ఎటువంటి ఇబ్బంది కలగలేదు

ప్రత్తిపాడు సీహెచ్‌సీ వైద్యురాలు శ్వేత


ఏలేశ్వరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జనసేన నాయ కుడు వరుపుల తమ్మయ్యబాబుతో తమకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు సీహె చ్‌సీ వైద్యురాలు శ్వేత వెల్లడించారు. ఆమె బంధువు లతో కలిసి మంగళవారం తమ్మయ్యబాబు నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా లింగంపర్తిలో తమ్మయ్య బాబు నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 8న ప్రత్తిపాడు ప్రభుత్వాసుపత్రిలో జరిగిన వివాదంపై వివరణ ఇచ్చా రు. ఆ రోజు జనసేన నాయకుడు తమ్మయ్యబాబుతో తమకు ఎటువంటి ఇబ్బంది కలగలేదని, రోడ్డు ప్రమా దానికి సంబంధించిన క్షతగాత్రుల సహాయకుల వల్లే తమకు ఇబ్బంది కలిగిందని ఆరోపించారు. ఆరోజు వ చ్చిన వార్తలన్నీ నిరాధారాలని, కేవలం రోడ్డు ప్రమాదం లో గాయపడి వచ్చిన వారికి వెంటనే చికిత్స అందజేశా మన్నారు. ఇదే సందర్భంలో వారికి దగ్గర బంధువులు కంగారు పడి తమపై కేకలు వేశారని తెలిపారు. వైద్యు రాలు దగ్గర బంధువు శ్యామ్‌గోపాల్ మాట్లాడుతూ శ్వే తకు విధి నిర్వహణలో ఏ ఆటంకాలు ఎదురవ్వలేదని, తమ్మయ్యబాబు మాకు దగ్గర బంధువేనని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యురాలు శ్వేత

యానాంలో..

వైభవంగా వెంకన్న కల్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు

యానాం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): యానాంలో కొలువై ఉన్న శ్రీభూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగం గా స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వ హించారు. సుమారు 600ఏళ్ల క్రితం నాటి రెడ్డి రాజులకాలంలో నిర్మితమైన నాడు చద్దుకూడు వెంకన్నగాను...నేడు మీసాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయం వార్షిక కల్యాణ మహోత్సవాలు అప్పటి నుంచి జరుగుతున్నాయి. ఈ కల్యాణ ఉత్సవాన్ని అనువం శిక ఉత్సవదారులు చింతా వెంకటసుబ్బరావు కుటుం బసభ్యులు నిర్వహించారు. స్వామివారికి పుదుచ్చేరి ప్ర భుత్వం తరుపున యానాం డిప్యూడి కలెక్టర్, పరిపాలనా ధికారి మునస్వామి పట్టు పీతాంబరాలు, ప్రజల తరు పున స్థానిక ఎమ్మెల్యే గొల్ల పల్లి శ్రీనివాస్ అశోక్ స్నేహ దంపతులు పట్టు వస్త్రాలు మంగళ సూత్రాలు, దేవదా యశాఖ తరపున కార్యనిర్వ హణ అధికారి జ్యోతి వెంక టేశ్వర్లు ముత్యాల తలం బ్రాలు సమర్పించారు. తిరు మల తిరుపతి దేవస్థానం ఆస్థాన పండి తులు వాడపల్లి గోపాలచార్యులు శిష్యబృం దం కల్యాణఘట్టంలోని ప్రతీ అంశాన్ని వివ రిస్తూ క్రతువు నిర్వర్తించారు. ముత్తయిదు వులందరికీ పసుపు, కుంకుమలు పంపిణీ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావ డంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది.



పట్టు వస్త్రాలు, మంగళ సూత్రాలు తీసుకెళ్తున్న అతిథులు

ఆటో బోల్తా పడి వ్యక్తి మృతి

మోతుగూడెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి):ఆటో బోల్తా పడడంతో ఒక వ్యక్తి మరణించాడు. దేవీపట్నం మండ లం నుంచి ఏపీ 39 యూజే 6646 ఆటోలో పది మంది చింతూరు మండలం కొండపల్లిలో జరిగే బంధువుల దిన కార్యక్రమానికి వెళ్తున్నారు. ఆటో డ్రైవర్ స్పీడ్‌గా, అజాగ్రత్తగా నడపడంతో ఆటో ఘాట్‌రోడ్డులో ఉన్న దుర్గమ్మ ఆలయం వద్దకు వచ్చే సరికి మలుపు దగ్గర బోల్తా పడింది. ఈ ఘటనలో ముచ్చిక బాబూరావుకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. మిగిలినవారికి స్వల్ప గాయాలయ్యాయి. మోతుగూడెం ఎస్ఐ శివనారాయణ కేసు నమోదు చేసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

మహాసేన రాజేష్‌కు మంత్రి లోకేశ్ పరామర్శ

ప్రత్తిపాడు , మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): టీడీపీ రాష్ట్ర అధికార ప్రతి నిధి మహాసేన రాజేష్‌ను మంగళ వారం రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. మహాసేన రాజేష్ తండ్రి సాదుసుందర్‌సింగ్ మృతి చెందడంతో లోకేశ్ రాజేష్ కు ఫోన్ చేసి పరామర్శించి సాదు సుందర్ సింగ్ మృతి పట్ల విచారం వ్యక్తం చేసి సంతాపం తెలిపారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FINANCE

గవర్నమెంట్ రిటైర్డ్ పెన్షనర్స్‌కు (కేంద్ర/ రాష్ట్ర), ప్రభుత్వ ఉద్యోగస్తులకు (కేంద్ర / రాష్ట్ర) సులభ వాయిదాల పద్ధతిలో వెంటనే ఫైనాన్స్ చేయబడును. వెంకటేశ్వర ఫైనాన్స్. Govt. Reg.No.176/2019. Cell: 9550648668

AJD:207810

GOLD FINANCE

బంగారం కొనబడును, బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు తీసుకుంటాం. (స్పాట్ క్యాష్) సంప్ర : 88024 89999

AJB-209318

4 Lines CLASSIFIED Rs.230/- Only

జీజీహెచ్‌లో ముగ్గురు జీబీఎస్ బాధితులకు చికిత్స

జీజీహెచ్ (కాకినాడ), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో గులియన్- బారే సిండ్రోమ్ (జీబీ ఎస్) బారిన పడిన ముగ్గురు బాధితులు చికిత్స పొం దుతున్నట్టు ఆసుపత్రి సూపరిండెంట్ డా.ఎస్ లావణ్యా కుమారి మంగళవారం తెలిపారు. వారిలో ఇద్దరు జీబీ ఎస్‌తో బాధపడుతుండగా మరో వ్యక్తిలో అనుమానాస్ప ద లక్షణాలు కనబడడంతో ఆ వ్యక్తిని కూడా జీజీహె చ్‌లో ప్రత్యేక వార్డులో చేర్చి వైద్య పరీక్షలు నిర్వహిస్తు న్నట్టు పేర్కొన్నారు. జీజీహెచ్‌లో జీబీఎస్ కేసులకు సంబంధించి చికిత్స, మందులు, వ్యాక్సిన్, మౌలిక సదు పాయాలు పూర్తిగా అందుబాటులో ఉన్నాయన్నారు.

కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాడని దాడి

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 11 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఆండ్రంగిలో ప్రభుత్వ చెరువు ఆన్యాక్రాంతం అవుతోందని గ్రామంలో చదువుకున్న ఒక యువకుడు సోమవారం కాకినాడ కలెక రేట్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ నెపంతో ఇంటి మీదకు వచ్చి కొందరు ఆక్రమణదారులు ఆ యువ కుడిపై దాడి చేశారు. ఈ దాడికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

గృహోపకరణాల గోదాములో అగ్నిప్రమాదం



ఎగిసిపడుతున్న మంటలు

రాజమహేంద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జాతరకు కాల్చిన బాణసంచా వల్ల ఓ ప్లాస్టిక్ గృహోపకరణాల గోదా ములో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఫైర్ అధికారులు, ప్రత్యక్ష సాక్షి విజయ్‌కుమార్ ప్రాథమిక సమాచారం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్ర వరంలో పాత సోమాలమ్మ ఉత్సవాల్లో భాగంగా బాణసంచా కాల్చారు. ఓ తారాజువ్వ దేవాలయం ఎదుటి సందులో ఉన్న హర్షిత ప్లాస్టిక్ ఎంటర్‌ప్రైజెస్ గోదాము ప్రాంగణంలోని ఓ ఎండిపోయిన కొబ్బరిచెట్టుపై పడింది. అది రాజుకుని నిప్పు లు కింద కొబ్బరి మట్టల్లో పడి మంటలు చెలరేగి పక్కనే ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములకు మంటలంటుకున్నాయి. గోదాము ప్లాస్టిక్ గృహోపకరణాలు కావడంతో వేగంగా మంటలు చెలరేగాయి. ప్లాస్టిక్ డ్రమ్ములకు మూతలు ఉండడంతో పెద్ద శబ్దం తో పేలడంతో చుటు పక్కల ఇళ్లలోని నివాసి తులు బయటికి పరు గులు పెట్టారు. కొవ్వూ రు, ఇన్నీసుపేట, ఆర్యా పురం ఫైర్ ఇంజన్లతో సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఆస్తి నష్టం రూ.20 లక్షల వరకూ ఉంటుందని యజమాని చెబుతు న్నారని చీఫ్‌ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్‌కింగ్ పేర్కొన్నారు.

మృతదేహంతో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా

కాకినాడ రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఇంద్రపాలెంలోని సౌత్ ఎక్సైజ్ స్టేషన్‌వద్ద ఏటిమొగలో జరిగిన సంఘటనలో కర్రి సత్యవతి (70) మృతిచెందింది. వివరాల్లోకి వెళితే.. అక్రమంగా మద్యం అమ్ముతున్నారనే స మాచారంతో ఎక్సైజ్ ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుల్స్ మంగళ వారం రాత్రి 7.30 గంటలప్రాంతంలో ఏటిమొగ తూర్పుప్ర క్క ఆంజనేయస్వామి గుడికి సమీపంలో తనిఖీచేయగా కర్రి పద్మావతి ఆందోళనకు గురై కిందపడిపోయింది. ఆమెను కుటుంబసభ్యులు జీజీహెచ్‌కు తీసుకువెళ్లగా అక్కడ మర ణించినట్టు సమాచారం. దీంతో కుటుంబసభ్యులు, బంధు వులు కలిసి మృతదేహాన్ని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడ తమకు న్యాయం చేయాలంటూ ధర్నా చేశారు. కొంతసమయం తరువాత విరమించి మృతదేహాన్ని తీసు కుని వెళ్లిపోయారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఈ సమ స్యపై మాట్లాడుతూ తమ పోలీసుల వల్ల ఆమె చనిపోయిం దేమోననే అనుమానంతో వారంతా మృతదేహంతో స్టేషన్‌వ ద్దకు వచ్చారని, జరిగిన సంఘటనను వారందరికీ వివరించ డంతో వెళ్లిపోయారన్నారు. ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చినవా రిలో అసిస్టెంట్ కమిషనర్ రేణుక, ఏఈఎస్ మౌనిక, సూప రింటెండెంట్ కృష్ణకుమారి, సీఐ నిరంజన్‌రావు ఉన్నారు.

మండల ప్రజా పరిషత్ కార్యాలయము నరసాపురం

ఆ.క.నెం.వ.అ.13/2025 తేది.11.03.2025

మాధవాయిపాలెం ఫెర్రి టెండరు కమ్ బహిరంగ వేలము ప్రకటన

ది.21.03.2025 శుక్రవారం మధ్యాహ్నం గం.02.00లకు నరసాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు నరసాపురం మండల ప్రజా పరిషత్ అధీనములో గల మాధవాయిపాలెం ఫెర్రి 2025-2026 ఆర్థిక సంవత్సరమునకు అనగా 01.04.2025 నుండి 31.03.2026 వరకు టోల్లు వసూలు చేసుకొనుటకు సీల్డు టెండరుతో కూడిన బహిరంగ వేలము నిర్వహించబడును. ఆసక్తి గల కాంట్రాక్టర్లు పాల్గొనవలసినదిగా కోరడమైనది.

వేలం వివరముల సంగ్రహము

1.ఫెర్రి వివరము	: మాధవాయిపాలెం ఫెర్రి నరసాపురం మండలం పశ్చిమగోదావరిజిల్లా.
2.టోల్లు వసూలు చేయు కాలము	: 01.04.2025 నుండి 31.03.2026 వరకు
3.ప్రారంభ పాట మొత్తము	: రూ.3,13,00,002/-
4.డిపాజిట్లు	: రూ.31,30,000/- (జాతీయ బ్యాంకుపై తీసిన డ్రాఫ్ట్ / బ్యాంకరు చెక్కు).
5.పాట సొమ్ము చెల్లించు విధానము	: సమాన వాయిదాలలో చెల్లింపు పద్ధతి (డిపాజిట్ సొమ్ము కలుపకుండా మరియు రెండు నెలల వాయిదా సొమ్ము అడ్వాన్సుగా చెల్లించవలెను)
6.సాల్వెన్సీ మొత్తము	: రూ.3,13,00,002/-
7.ఎ) టెండరు షెడ్యూలు ఖరీదు	: రూ. 2000/-
బి)సేల్స్ టాక్సు	: రూ.240/-
సి) షెడ్యూలు ఖరీదు చెల్లించవలసిన విధానము	: 8448-109-02-001 మండల ప్రజాపరిషత్ నరసాపురం పద్దునకు చలన ద్వారా జమ వేయవలెను (లేదా) మండల పరిషత్ అభివృద్ధి అధికారి నరసాపురం వారి పేరున తీసిన డ్రాఫ్ట్ / బ్యాంకరు చెక్కు
8.టెండరు షెడ్యూలు కొరకు దరఖాస్తు చేసుకొనుటకు ఆఖరు తేది	: 17.03.2025 సోమవారం సాయంత్రం గం.5.00ల వరకు
9.ధృవ పత్రములు స్వీకరించుటకు,EMDస్వీకరించుట మరియు Entry Passలు జారీ చేయుటకు ఆఖరు తేది	: 20.03.2025 గురువారం సాయంత్రం గం.5.00ల వరకు
10.సీల్డు టెండర్లు స్వీకరించు తేది మరియు సమయం	: 21.03.2025 శుక్రవారం మధ్యాహ్నం గం.02.00లకు వరకు
11.బహిరంగ వేలము తేది మరియు సమయము	: 21.03.2025 శుక్రవారం మధ్యాహ్నం గం.02.00ల నుండి
12.సీల్డు టెండర్లు తెరచు తేది మరియు సమయము	: 21.03.2025. జరుగు బహిరంగ వేలము తదుపరి టెండర్లు తెరువబడును.
13.టెండర్లు తెరచుట/బహిరంగ వేలము జరుగు స్థలము	: మండల ప్రజా పరిషత్ కార్యాలయము, నరసాపురం
14.వేలం నిర్వహించు అధికారి	: మండల పరిషత్ అభివృద్ధి అధికారి, లేదా వారి అనుమతి పొందిన వారిచే గాని నిర్వహించబడును.

టెండరు షరతులు ఇతర వివరములకు నరసాపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయము నందు అన్ని పని దినములు యందు సంప్రదించవచ్చును. సంప్రదించవలసిన ఫోన్ నెంబరు 9493742441, 9666290336

నరసాపురం
తేది.11.03.2025

మండల పరిషత్ అభివృద్ధి అధికారి
మండల ప్రజా పరిషత్ కార్యాలయం నరసాపురం

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

భూసార పరీక్షలు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు.. చక్రద్వారబంధంలో 'పొలం పిలుస్తోంది'



చక్రద్వారబంధంలో మాట్లాడుతున్న మాధవరావు

రాజానగరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించి, వాటి ఫలితాలకు అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపడితే మేలైన దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు పేర్కొన్నారు. మండలంలోని చక్రద్వారబంధం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూసార పరీక్షలకు అధిక ప్రాధాన్యమివ్వడమే కాకుండా అధికశాతం నిధులు కేటాయించిందని, రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుత వేసవిలో పంట కోతలు పూర్తయిన వెంటనే భూసార పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. వేసవిలో జీలుగ, జనుము, పీఎండీఎస్ విత్తనాలు చల్లుకుని నేలను అధిగ ఉష్ణోగ్రతల నుంచి కాపాడుకోవడం ద్వారా భూసారం పెంచుకునే అవకాశం ఉంటుందన్నారు. సాగులో ఎరు వుల వాడకాన్ని తగ్గించి భూసారాన్ని పరిరక్షిం చడంతో పాటు పెట్టుబడి ఖర్చులను తగ్గించి ఆరోగ్యకరమైన, దిగుబడినిచ్చేలా పంటలు పండించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏడీఏ డీఆర్‌సీ జయలక్ష్మి, ఏవో షేక్ ఇమామి ఖాసిం, హెచ్‌ఈవో అరవింద్ సాయి, వ్యవసాయ సహాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేదునూరి గంగాధరం వర్ధంతి



నేదునూరి కుమార్తె సూర్యప్రభావతిని సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్,మార్చి 11(ఆంధ్రజ్యోతి): జానపద వాఙ్మయ బ్రహ్మ నేదునూరి గంగాధరం స్మృతిగా తెలుగు విశ్వ జటద్యాలయంలో జానపద కళల విభాగం ఏర్పాటు చేయాలని సీపీ బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిధానం శాస్త్రి డిమాండ్ చేశారు. మాదేటి రాజాజీ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి మాదేటి రవిప్రకాష్ అధ్యక్షతన మంగళవారం ఆనంద్‌నగర్ పార్కులో జరిగిన గంగాధరం వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. వందలాది జానపద గాయనీగాయకులను తయారు చేసిన గంగాధరం స్మారకం తెలుగు వర్సిటీలో ఉండాలని కోరారు. అనంతరం గంగాధరం విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.భాస్కరరావు, ఎన్.రామకృష్ణ, కొత్తపల్లి బంగారుబాబు, ఇమంది శంకరరావు, రావిపాటి సాయి భాస్కరరావు పాల్గొన్నారు. నేదునూరి గంగాధరం గ్రంథాలయంలో ఏబీ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రకేసరి యువజన సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ నేదునూరి ఎన్నో వేల జానపద గీతాలు సేకరించి తెలుగు వారికి మహోపకారం చేశారన్నారు. ఈ సందర్భంగా నేదునూరి కుమార్తె సూర్యప్రభావతిని సత్కరించారు. కార్యక్రమంలో శ్రీపాద సీతామహలక్ష్మి, పీవీఎస్ కృష్ణారావు, దేశిరెడ్డి బలరామనాయుడు, మల్లెమొగ్గల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ తొలగింపుపై డీఎల్‌పీవో విచారణ



కూలగొట్టిన ఇంటిని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగలత

సీతానగరం మార్చి 11(ఆంధ్రజ్యోతి): తన ఇంటిని నిబంధనలకు విరుద్ధంగా పడగొట్టారంటూ చినకొండేపూడి గ్రామానికి చెందిన పెన్నాడ జానకిరామయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం రఘుదేవపురం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ డివిజనల్ అధికారిణి నాగలత విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాది సీఎంవోలు ఇచ్చిన ఫిర్యాదును అనుసరించి అధికారుల సూచనల మేరకు విచారణ నిర్వహించినట్టు చెప్పారు. ప్రభుత్వాధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చారని, నోటీసులు కూడా ఇవ్వకుండా ప్రహరీ కూల్చారని, తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులు, ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారని, దీనిపై జానకిరామయ్య వద్ద స్టేట్‌మెంట్ తీసుకుని, కూలగొట్టిన ఇంటిని పరిశీలించడం జరిగిందన్నారు. నివేదికను పై అధికారులకు నివేదిస్తామన్నారు ఈ సందర్భంగా పెన్నాడ జానకి రామయ్య మాట్లాడుతూ తన వద్ద అన్ని సాక్ష్యాలు ఉన్నాయని తనకు న్యాయం చెయ్యాలని కోరారు.

16న మండల పరిషత్ సమావేశం

రాజానగరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రాజానగరం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 16న ఉదయం 10 గంటలకు ఎంపీపీ మందారపు సీతారత్నం అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జేపీ ఝాన్సీ మంగళవారం తెలిపారు. మండలంలోని వివిధ శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని కోరారు.

పరిమితి మించితే.. ఆటో సీజ్

» స్కూల్ పిల్లలను తరలించే వాహనాలపై డీటీవో దాడులు » 4 సీజ్, 16 ఆటోలపై కేసులు



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించే స్కూల్ బస్సులు, ఆటోలపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేస్తూ రెగ్యులర్‌గా తనిఖీలు జరుగుతాయని స్పష్టం చేశారు. పరిమితికి మించి స్కూల్ పిల్లలను తరలిస్తున్న ఆటోలపై రవాణాశాఖ కొరడా ఝుళిపించింది. జిల్లా రవాణాఅధికారి ఆదేశాల మేరకు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు మంగళవారం రాజమహేంద్రవరం సిటీలోని పలు ప్రాంతాల్లో ఆకస్మికంగా ఆటోల తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా స్కూల్ పిల్లలను తరలించే ఆటోలపై దృష్టి పెట్టారు. నిబంధనలను అతిక్రమించిన 4 ఆటోలను సీజ్ చేయడంతో పాటు 16 ఆటోలపై కేసులు రాశారు. సుమారు రూ.70,000 పెనాల్టీగా విధించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జి.రాధికాదేవి, కె.చైతన్యసుమ తమ సిబ్బందితో ఈ తనిఖీలు జరిపారు.



మోరంపూడి వద్ద ఆటోను తనిఖీ చేస్తున్న ట్రాన్స్‌పోర్ట్ అధికారి



ఆర్టీవో కార్యాలయం సమీపంలో తనిఖీలు

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

» ఈ నెల 22 గడువు » జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతులు (బీసీ-ఏ, బీసీ-బీ, బీసీ-డీ, బీసీ-ఈ) వారికి ఆయా పథకాల కింద బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీ ఆర్థిక సహాయం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ మేరకు అర్హుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. మేదర, కుమ్మరి, శాలివాహన, వారికి వృత్తిపరంగా బుట్టల అల్లకం, కుండల తయారీ చేసుకుంటున్న వారికి ఆయా పథకాలకు, బీ ఫార్మసీ, డీ ఫార్మసీ చదువుకున్నవారికి జనరిక్ ఫార్మసీ షాపుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే, ఈడబ్ల్యుఎస్ కేటగిరీకి చెందిన ఆర్యవైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ కులాలతోపాటు ఈబీసీ సామాజిక వర్గాల వారికి జిల్లా బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాలు మంజూరుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. వీరితో పాటు బీసీ, కాపు సామాజిక వర్గాలలోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల వారికి స్వయం ఉపాధి, ఎంఎస్ఎంఈ పథకాల కింద పథకాల మంజూరుకు చర్యలు తీసుకుంటున్నామని శ్రీనివాసరావు తెలిపారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న అభ్యర్థులు అవసరమైన అన్ని సర్టిఫికెట్లతో తమకు దగ్గరలోని నెట్ సెంటర్లు, మీ సేవా, గ్రామ సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తులను సమర్పించాలని చెప్పారు. దరఖాస్తులను సమర్పించడానికి ఆఖరు తేదీ ఈనెల 22 అని ఆయన పేర్కొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేదే స్కౌట్

ట్రైనింగ్ క్యాంప్ పరిశీలనలో ఎస్ఎస్ఏ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి



స్కౌట్ గైడ్ విద్యార్థులతో ఎస్ఎస్ఏ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి

కడియం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేదే స్కౌట్ అండ్ గైడ్ అని సర్వశిక్ష ప్రాజెక్టు కోఆర్డినేటర్ సుభాషిణి అన్నారు. రెండో రోజు స్కౌట్ గైడ్ పెట్రోల్ లీడర్ ట్రైనింగ్ క్యాంప్‌ను మంగళవారం ఆమె పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. కడియం గ్రామానికి చెందిన యువత ఎం.రాజేష్, టి.అయ్యప్ప, కె.శ్రీనివాస్, కె.మణికంఠ స్కౌట్ గైడ్ విద్యార్థులకు ఉదయం అల్పాహారం ఏర్పాటు చేశారని క్యాంపు ఆర్గనైజర్ గొల్లపల్లి సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో సర్వశిక్ష ఏఎంవో గౌరీశంకర్, సీఎంవో శ్రీనివాస్, క్యాంపు డైరెక్టర్ టి.సత్యనారాయణ, స్కౌట్ కార్యదర్శి రాజ్‌కుమార్, ఏఎల్‌టీలు నారాయణ మూర్తి, ధనలక్ష్మి, స్కౌట్ టీచర్లు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్య పరిష్కారానికి ఆటోవాలా యాప్

ఆన్‌లైన్ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు మధు



ఆటోవాలా యాప్‌ను ప్రారంభిస్తున్న మధు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిత్యం రోడ్లమీద ప్రయాణించే ఆటోడ్రైవర్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడడంతోపాటు ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారుల నుంచి ఏ సమస్య వచ్చినా డ్రైవర్ తన మొబైల్‌లోని ఆటోవాలా యాప్‌ను ప్రెస్ చేస్తే వెంటనే ఏఐటీయూసీ నాయకులు, ఆటో యూనియన్ నాయకులు అక్కడకు చేరుకుని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని ఆన్‌లైన్ ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు తాటిపాక మధు వెల్లడించారు. మంగళవారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో యూనియన్ అధ్యక్షుడు రామచంద్రరావు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎన్నికల్లో ఆటో, మోటారు కార్మికులకు సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రస్తుత శాసనసభ సమావేశాల్లో అమలు చేయాలని కోరుతున్నామన్నారు. జీవో నెం.21, 31 రద్దు చేయాలని, వాహనమిత్ర ఇవ్వాలని డిమాండ్ చేశారు. చిన్న వాహనాలపై భారీగా పెంచిన రోడ్డు ట్యాక్స్, థర్డ్‌పార్టీ బీమా, గ్రీన్‌ట్యాక్సులను 30శాతానికి తగ్గించాలని ఆయన కోరారు. సమావేశంలో యూనియన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు కాకినాడలో 'యువత పోరు'

గోకవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను విస్మరించడాన్ని నిరసిస్తూ ఈనెల 12న కాకినాడలో చేపట్టనున్న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ నాయకులు పాటి రాంబాబు, దాసరి చినబాబు, సుంకర వీరబాబు పిలుపునిచ్చారు. గోకవరంలోని చినబాబు స్వగృహంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. ఈ ఆందోళన కార్యక్రమానికి మండలంలోని నిరుద్యోగులందరూ హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం యువత పోరుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుల్లా ఏడుకొండలు, కర్రి సూరారెడ్డి, బిజ్జి రాజు, తుమ్మల శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బ్యాంకులను నిర్వీర్యం చేస్తే సహించం

యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ లక్ష్మీపతిరావు.. ఎస్‌బీఐ ఎదుట బ్యాంకు ఉద్యోగుల ధర్నా



కంబాలచెరువు ఎస్‌బీఐ ఎదుట ధర్నాలో పాల్గొన్న ఉద్యోగులు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేస్తే సహించేదిలేదని బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘం (యూఎఫ్‌బీయూ) జిల్లా కన్వీనర్ ఎన్.లక్ష్మీపతిరావు, నాయకులు శేషుకుమార్, పాపారావు అన్నారు. అలాగే, తమ న్యాయమైన అన్ని సమస్యలను పరిష్కరించకపోతే ఈనెల 24, 25 తేదీల్లో రెండు రోజుల సమ్మె తప్పదని హెచ్చరించారు. మంగళవారం వివిధ బ్యాంకుల ఉద్యోగులు రాజమహేంద్రవరంలోని కంబాలచెరువు స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా ఎదుట ధర్నా నిర్వహించారు. బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నానుద్దేశించి నాయకులు మాట్లాడారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఉద్యోగుల నియామకం చేయడం లేదని, ఇదే సమయంలో ప్రైవేట్ బ్యాంకుల్లో నియామకాలు చేపడుతున్నారన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేసే కుట్రలను అడ్డుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు శ్రీనివాస్, శాస్త్రి, చంద్రశేఖర్, మురళీధర్, సోమరాజు, రాంబాబు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రీన్ ట్యాక్స్‌ను తగ్గించాలి

ఏపీ ట్యాక్సీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ముచ్చికర్ల సత్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రీన్ ట్యాక్స్ పేరుతో వాహనాల నుంచి వసూలు చేస్తున్న ఫీజును తగ్గించాలని, రవాణా రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామిలను నెరవేర్చాలని ట్యాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముచ్చికర్ల సత్యనారాయణ కోరారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం పాదయాత్రలో మోటారు కార్మికులకు హామీలిచ్చారని వాటిలో హరిత పన్ను కూడా ఉందన్నారు. గతంలో రూ.200 చెల్లించేవారమని కాని వైసీపీ ప్రభుత్వం గ్రీన్ ట్యాక్స్ పేరుతో చిన్న వాహనాలకు రూ.4 వేలు, భారీ వాహనాలకు రూ.20 వేలు చెల్లించాలని జీవోను ప్రవేశపెట్టి రవాణ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేసిందన్నారు. పక్కరాష్ట్ర తమిళనాడులో రూ.500, కర్ణాటకలో రూ.300 వసూలు చేస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం తగ్గించలేదన్నారు. లోకేశ్ హామీ మేరకు ఆ రాష్ట్రాల కంటే తక్కువ ధరలు నిర్ణయించాలని కోరారు. నాలుగు చక్రాల వాహనాలు ఉన్న వారికి రేషన్ కార్డు తొలగించడం వల్ల ప్రభుత్వ పథకాలు వర్తించక నష్టపోయారన్నారు. అలాగే డీజిల్ ధరలు తగ్గించాలని అప్పట్లో విజ్ఞప్తి చేశామన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీవో వల్ల ఫిట్‌నెస్‌ను ప్రైవేట్ పరం చేశారని, దానిని ఎంవీఐ మాత్రమే నిర్వహించాలన్నారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.ఆదినారాయణ, నాయకులు దొమ్మేటి సోమశంకర్, దరసాల రామకృష్ణ (నిడదవోలు), జనపరెడ్డి కుమార్, నార్గాన వసంతకుమార్, మద్దుల కిరిణ్, పానుగంటి సత్యనారాయణ, దేవినేని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆసుపత్రి పరిశీలన

ఇంకుడు గుంతలు, బయోవేస్ట్‌కు షెడ్ నిర్మించాలి: కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం పేపరుమిల్లు ఎదురుగా నిర్మించిన కార్మిక బీమా ఆసుపత్రిని మునిసిపల్ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం పరిశీలించారు. ఆసుపత్రికి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ విడుదల చేసే సందర్భంగా కమిషనర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీపీడబ్ల్యుడీ ఇంజనీర్లను ఆసుపత్రి ఆవరణంలో ఇంకుడు గుంతలు పెట్టమని, బయోమెడికల్ వేస్ట్ ప్రొసెసింగ్ నిమిత్తం షెడ్ నిర్మించాలని మని ఆదేశాలు జారీ చేశారు. ఈ తనిఖీలో టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ కోటయ్య, డిప్యూటీ సిటీప్లానర్, సిబ్బంది పాల్గొన్నారు.

'వైసీపీ పోషించిన బ్యాచ్‌లను కూటమి అణచివేసింది'

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో మాజీ ఎంపీ భరత్ రామ్ అధికారంలో ఉన్నప్పుడు పెంచి పోషించిన గంజాయి, బ్లేడు బ్యాచ్‌లను కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అణచివేయించారని టీడీపీ నేతలు మజ్జి రాంబాబు, నక్కా దేవి వరప్రసాద్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును ఈవీఎం ఎమ్మెల్యే అని వ్యాఖ్యానించిన భరత్.. ఇటీవల బ్యాలెట్‌పై పట్టభద్రుల ఎమ్మెల్సీ గెలిచిన కూటమి సత్తా ఏమిటో తెలుసుకోవాలన్నారు. సమావేశంలో పోలాకి పరమేష్, బుడ్డిగ రవి, పిల్లి శ్యామ్, చింతపల్లి నాని, కందికొండ అనంత్, శివారెడ్డి, వెల్లంకి జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అరికట్టాలి : ఏఐఎస్ఎఫ్

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండానే ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారికి ఒక వినతిపత్రం అందజేసినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కి అడ్మిషన్లు నిర్వహిస్తున్నాయని, ఇలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వీఎన్ జ్యోతి, ప్రజ్వలన, త్రిమూర్తులు, శ్రీనివాస్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన మెగా బైక్ ర్యాలీ

కోరుకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న చిత్రాడలో జరుగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకకు మద్దతుగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం మెగా బైక్ ర్యాలీ నిర్వహించారు. కోరుకొండలోని పార్టీ కార్యాలయం నుంచి సాయంత్రం 4గంటలకు పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు బైకులు, కార్లతో ర్యాలీగా ఎమ్మెల్యేకు స్వాగతం పలికి బైక్ ర్యాలీగా రాజానగరం నుంచి పార్టీ కార్యాలయానికి చేరుకుంది. అక్కడ పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి తీన్మార్ డప్పులు,పూలవర్షం కురిపిస్తూ యువత కేరింతలతో మహిళల హారతులతో అడుగడుగునా ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే బత్తుల ధన్యావాదాలు తెలిపారు.



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తుల

పేకాడుతున్న పది మంది అరెస్టు

కోరుకొండ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గాదరాడ గ్రామ శివారున పేకాట శిబిరంపై ఎస్ఐ టి.శ్యామ్‌సుందర్ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ సందర్భంగా 10 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.84,760 నగదు, 13 సెల్‌ఫోన్‌లు, 5 బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిర్వాహకులు వల్లేపల్లి గోపీ, గంగాధర్, చంటిపరారీలో ఉన్నారని ఎస్ఐ తెలిపారు.

త్వరలో మార్కండేయస్వామి ఆలయ ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠ

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక గోదావరిగట్టున ఉన్న శ్రీ ఉమా మార్కండేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ త్వరలో చేయనున్నట్టు దేవస్థానం మాజీ చైర్మన్ యిన్నమూరి దీపు, ఆలయ ఈవో పెదపూడి రాజబాబు వెల్లడించారు. మంగళవారం దేవస్థానంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దీపు మాట్లాడుతూ 150 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం పాడైపోయిందని, త్వరలో పునః ప్రతిష్ఠతోపాటు మహా కుంభాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఈవో మాట్లాడుతూ ధ్వజస్తంభానికి అవసరమైన 52 అడుగుల కలప కోసం అన్వేషిస్తున్నామన్నారు. సమావేశంలో మదన్‌సింగ్, రాజ్‌పురోహిత్, నల్లం ఆనంద్, అర్చకులు కె.శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

అనపర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రాలేదని అనపర్తి శివారు సావరానికి చెందిన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ దుర్గాప్రసాద్ వివరాల ప్రకారం.. సావరానికి చెందిన మల్లివలస ఎర్రాకుమార్‌కు 2022లో మామిడాడకు చెందిన యువతితో వివాహమైంది. మద్యానికి బానిసైన కుమార్ భార్యను వేధిస్తుండడంతో 20రోజుల కితం పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రావాలని కోరినా రాకపోవడంతో గత నెల 27న పురుగుల మందు తాగాడు. బంధువులు అనపర్తి, అక్కడి వైద్యం కోసం కాకినాడ తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

ధాన్యలక్ష్మిగా పాతసోమాలమ్మ



రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్యామలా నగర్‌లో శ్రీ పాత సోమాలమ్మ మంగళవారం ధాన్యలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో చండీహోమం నిర్వహించారు. సాయంత్రం కోలాటం,పల్లకీ సేవ, ఊయల సేవ, సాయిబాబా భజన నిర్వహించారు. అధిక సం ఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమాలను ఆల య ధర్మకర్త గొర్రెల సురేష్ పర్యవేక్షించారు.

పది పరీక్షలకు 920 మంది విద్యార్థులు

గోకవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఈనెల 17నుంచి 31వరకు మండలంలో జరగబోయే పదో తరగతి పరీక్షలకు 920 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు ఎంఈవో బి.గౌరమ్మ మంగళవారం తెలిపారు. మండలంలోని ఏడు జడ్పీ ఉన్నత పాఠశాలలు,రెండు ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలలు,నాలుగు ప్రైవేట్ స్కూల్స్ నుంచి పదో తరగతి విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నారు. ఐదు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.

నగరేశ్వరస్వామి కల్యాణం



స్వామికి పట్టువస్త్రాలు

కడియం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): జేగురుపాడు నగరేశ్వరస్వామి కల్యాణం ఆలయ అర్చకులు మహేష్,సూరిబాబుల వేదమంత్రాలు మధ్య ఘనంగా జరిగింది. సీనియర్ టీడీపీ నాయకులు గారపాటి శ్రీఅమరనాథ్, పాతూరి రాజేష్ స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యాదల స్టాలిన్, ఎంపీటీసీ నాగిరెడ్డి రామకృష్ణ, మర్రెడ్డి రమేష్ పాల్గొన్నారు.

గణపతి ఆలయానికి రూ.1,01,116 విరాళం

కడియం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): వీరవరంలో శ్రీలక్ష్మిగణపతి నందీశ్వర చౌడేశ్వరీ ఆలయానికి కడియపులంక నర్సరీ రైతు, టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ రూ.1,01,116 విరాళం మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మార్గానిని ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి ఆయన దాతృత్వాన్ని అభినందించారు.



మార్గానిని సత్కరిస్తున్న దృశ్యం

నగరపాలక సంస్థ రాజమహేంద్రవరం

ఆర్.ఒ.సి.నెం.323/2025-ఎ16 తేది:10-03-2025

వేలం నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో గల ఈ దిగువ తెలిపిన మార్కెట్లకు 2025-26 సంవత్సరమునకు గుత్తేదార్లకు స్వాధీనము చేసిన నాటి నుండి 31-03-2026 వరకు ఆశీలు వసూలు చేసుకొనే గుత్తహక్కు నిమిత్తం ది.28-03-2025వ తేది ఉదయం గం.11:00 నుండి నగరపాలక సంస్థచే ప్రకటించబడిన గజిట్ నోటిఫికేషన్ నెం.08/2025 లోని రేట్లు మరియు షరతులకు లోబడి శ్రీయుత కమిషనరు వారు కాని వారిచే అనుమతి పొందిన అధికారి వారిచే కాని వేలము నిర్వహించబడును. మరియు గుత్తదారుడు పాట మొత్తమునకు స్వీపర్ ఛార్జీలు అదనము మరియు వాటి మొత్తముపై 18% జి.ఎస్.టి. అదనము.

వ.నెం.	మార్కెట్టు పేరు	ధరావత్తు రూ.	బ్యాంకు గ్యారంటీ రెండు సంవత్సరములకు (రూ)
1	జాంపేట మార్కెట్టు	3,75,000	5,00,000
2	సెంట్రల్ విజిటబుల్ మార్కెట్టు	5,00,000	7,00,000
3	నాగులచెరువు మార్కెట్టు	7,00,000	9,00,000
4	ఆల్కట్ గార్డెన్స్ మార్కెట్టు	2,00,000	3,00,000
5	జలపుష్ప భవనము (హోల్ సేల్ చేపల మార్కెట్టు)	40,000	75,000
6	క్వారీ మార్కెట్టు	12,000	25,000
7	ఎం.ఎ. మార్కెట్టు	1,00,000	1,50,000
8	అరటిపండ్ల మార్కెట్టు	4,50,000	6,00,000

ఆసక్తి గలవారు ది.27-03-2025వ తేది సాయంత్రం గం.4:00 ల లోపు ధరావత్తు సొమ్ము (కమిషనరు,నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున) డిమాండ్ డ్రాఫ్ట్ మరియు నిర్దేశించిన సొమ్ముకు బ్యాంకు గ్యారంటీ సమర్పించి షెడ్యూల్ పొందవచ్చును. ఏ కారణము తెలుపకయే వేలమును వాయిదా వేయుటకు లేదా రద్దుపరచుటకు నగరపాలక సంస్థ, కమిషనరు వారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో రెవెన్యూ ఆఫీసరు-1 గారిని సంప్రదించవచ్చును.

షరతులు : 1) వేలము నందు పాల్గొనదలచిన వారు తమ ఫోటో మరియు సంతకముతో కూడిన గుర్తింపు కార్డు అందచేసి వేలం నందు పాల్గొనవలెను. ఇతరులకు ఆథరైజేషన్ ఇచ్చుట అనివార్యమైనప్పుడు అట్టి ఆథరైజేషను నోటరీ అఫిడవిట్ ద్వారా (ఫోటో, పూర్తి చిరునామాతో సహా) సమర్పించవలెను. లేనిచో, పాటదారులు మాత్రమే వేలములో పాల్గొనవలెను. ఇతరులు ఎవ్వరినీ అనుమతించబడదు. 2) దరఖాస్తులు దాఖలు చేసిన వారు మాత్రమే వేలమునకు అనుమతించబడును. 3) వేలం ఖాయపరిచిన తదుపరి గుత్తదారుడు 3 పోస్ట్ డేటెడ్ చెక్కులు సమర్పించవలెను. 4) వేలం ఖాయపరిచిన 7 రోజులలో గుత్తదారుడు తమ స్వంత ఖర్చులతో లీజుకాలమునకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిస్ట్రేషన్ చేసుకొనవలెను, లేనిచో గుత్తేదారుని ధరావత్తు నగరపాలక సంస్థకు జమచేసుకొని లీజు రద్దు చేయబడును. 5) పై షరతులకు లోబడి బ్యాంకు గ్యారంటీ, లీజుకాలము రిజిస్ట్రేషన్ మరియు 6 నెలల అడ్వాన్సు సమర్పించిన తరువాత మాత్రమే ఆశీలు వసూలు చేసుకొనుటకు అనుమతించబడును. 6) పాట మరియు స్వీపర్ ఛార్జీల మొత్తమునకు జి.ఎస్.టి. 18% అదనము (కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల ప్రకారము). 7) గతములో పాడుకొని కోర్టు కేసులు ఉన్నవారు మరియు నగరపాలక సంస్థకు ఏ విధమైన బకాయిలు ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు

కమిషనరు,
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం



రంజాన్ వేళలు	ఇఫ్తార్ (బుధ)	సా.6.21
	సహరి (గురు)	ఉ.4.52

నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులపై ఎక్స్‌పర్ట్ కమిటీ నివేదిక ఇవ్వండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ ప్రశాంతి

నిడదవోలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేసే క్రమంలో అధికారులతో కూడిన ఎక్స్‌పర్ట్ కమిటీ క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ, రైల్వే అధికారులతో సమీక్షించారు. నిడదవోలులోని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో శింగవరం, శెట్టిపేట, తాళ్ళపాలెం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం జరిగిందన్నారు. సమన్వయ శాఖల, సాంకేతిక నిపుణులతో కూడిన అధికారుల బృందం వాస్తవ పరిస్థితిని అంచనా వేసి నివేదిక అందజేయాలన్నారు. ఆర్డీవో రైల్వే ఈఈ, ఇరిగేషన్ ఎస్ఈ, జిల్లా వ్యవసాయశాఖ అధికారులతో కలసి రానున్న 2,3 రోజుల్లో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, రైల్వే ఈఈ అశోక్‌కుమార్, తహశీల్దార్ బి.నాగరాజు నాయక్ పాల్గొన్నారు.

'తూర్పు'న కొబ్బరి అభివృద్ధి బోర్డు ఏర్పాటుచేయాలి

లోక్‌సభలో ఎంపీ పురందేశ్వరి



రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో ప్రత్యేక కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. లోక్‌సభలో మంగళవారం కొబ్బరి రైతుల సమస్యలను పురందేశ్వరి ప్రస్తావించారు. రాజమండ్రి కేంద్రంగా కొబ్బరి బోర్డు ఏర్పాటుచేస్తే రాష్ట్రంలోని రైతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కొబ్బరిసాగులో ఆంధ్రప్రదేశ్ నాల్గవ స్థానంలో ఉందన్నారు. ప్రధానంగా కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో 1.23 లక్షల హెక్టార్లలో కొబ్బరి తోటలు ఉన్నాయన్నారు. 1981లో ఏర్పాటైన కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రధాన కార్యాలయం కేరళలో ఉండడం ప్రాంతీయ కార్యాలయాలు ఆంధ్రప్రదేశ్‌కు దూరంగా ఉండడంతో రైతులు సకాలంలో సలహాలను పొందడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇటీవల కొబ్బరికి వచ్చిన తీవ్రమైన ముప్పులను పరిశీలిస్తే కొబ్బరి బోర్డు దగ్గరలోనే ఉండాలన్న తక్షణ అవసరాన్ని తెలియజేస్తున్నదన్నారు. ఏపీ ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని 'తూర్పు'న ప్రత్యేక కొబ్బరి అభివృద్ధి బోర్డు కార్యాలయం ఏర్పాటుచేయాలని కోరారు.


ఏపీలో కంప్రెస్డ్ బయో గ్యాస్ పరిస్థితి ఏంటి?

రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు



కాకినాడ సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పెట్రోలియం, నేచురల్ గ్యాస్‌కు సంబంధించి కంప్రెస్ట్ బయో గ్యాస్ (సీబీజీ) పైప్‌లైన్ మౌలిక సదుపాయాలకు ఎటువంటి లక్ష్యాలను నిర్దేశించిందని రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు ప్రశ్నించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో మంగళవారం పలు అంశాలు లేవనెత్తారు. ఏపీలో ఈ పథకం అమలు స్థితి, కాకినాడ జిల్లాలో గ్యాస్ పంపిణీ నెట్‌వర్క్ ద్వారా లబ్ధిదారుల వివరాలు కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హరిదీప్‌సింగ్ పూరి కంప్రెస్ట్ బయోగ్యాస్ ప్లాంట్లను సీజీడీ నెట్ వర్క్‌కు అనుసంధానానికి రూ.994.50 కోట్ల నిధులతో 100 ప్రాజెక్టులు చేపట్టడం జరిగిందన్నారు. గతేడాది చివరికి రాష్ట్రంలో 246 సీఎన్‌జీ స్టేషన్లకు కాకినాడలో 13 స్టేషన్లు, 2,91,383 డొమెస్టిక్ కనెక్షన్లకు కాకినాడలో 66,301 కనెక్షన్లు ఇచ్చారని వివరించారు. పరిశ్రమల స్థాపన, ఉత్పత్తి సామర్థ్య విస్తరణ, ఉద్యోగావకాశాలు పెంపు లక్ష్యాలపైనా సానా ప్రశ్నించారు.

ఓమ్మై.. గాడ్!



నామినేటెడ్ పదవులకు తీవ్రపోటీ

- ఉమ్మడి జిల్లాలో 1713 ఆలయాలు
- పెద్ద ఆలయ బోర్డులకు డిమాండ్
- వాడపల్లి ఆలయంపై ప్రధాన దృష్టి
- పోటీపడుతున్న కూటమి నేతలు
- ప్రముఖ ఆలయాల్లోనూ ఇంతే
- నియోజకవర్గాల వారీ కసరత్తు
- పెరుగుతున్న ఆశావహులు
- కొన్ని కుర్చీలపై కర్చీఫ్‌లు
- ద్వితీయస్థాయి నేతల పైరవీలు

(రాజమహేంద్రవరం /అమలాపురం - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో నామినేటెడ్ పోస్టులకు ఆశావహులు పెరుగుతున్నారు. ఇప్పటినుంచే ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేల ముందు క్యూకడుతున్నారు. పోస్టులు ఇప్పించాలని కోరుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వమేర్పడి పది నెలలు కావస్తుండడంతో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న కూటమి నాయకులు ఊహల పల్లకిలో విహరిస్తున్నారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో అవకాశం కల్పించాలంటూ నియోజకవర్గ ఎమ్మెల్యేల ద్వారా పార్టీ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నారు. ఆర్థిక స్థోమత కలిగిన మరికొందరు వ్యూహాత్మకంగా ఎమ్మెల్యేలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉన్నారు.ఈ నెలాఖరుకి లేదా ఏప్రిల్ చివరికి వేలాది మంది కూటమి నేతలు, కార్యకర్తలకు నామినేటెడ్ పోస్టులు దక్కనున్నాయి.



కత్తిమీద సాములా..

ఈనెల 14వ తేదీన పిఠాపురం కేంద్రంగా జనసేన రాష్ట్ర స్థాయి ప్లీనరీ నిర్వహణకు ఆ పార్టీ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్లీనరీలో చర్చనీయాంశంగా నామినేటెడ్ పదవులపై చర్చ జరగొచ్చని జనసేన వర్గాల్లో వినిపిస్తోంది. కొన్ని నియోజకవర్గాల్లో టీడీపీ నాయకత్వం వద్ద తమకు తగిన గుర్తింపు లభించడం లేదనే అంశాన్ని లేవనెత్తడం ద్వారా ప్రభుత్వం భర్తీ చేసే నామినేటెడ్ పోస్టుల్లో అగ్రతాంబూలం కల్పించాలనే ఒత్తిడి పెంచనున్నట్టు సమాచారం. అదేవిధంగా గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పడి పార్టీ కోసం కష్టపడ్డ కేడర్‌ను కాదని.. ఎన్నికల సమయంలో వైసీపీ నుంచి టీడీపీ, జనసేనలోకి చేరిన కొందరు నాయకులకు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ప్రాధాన్యం కల్పిస్తున్నారంటూ ఇప్పటికే ఆయా కేడర్లు ఆరోపణాస్త్రాలు సంధిస్తున్నాయి. రాజోలు నియోజకవర్గంలో నిజమైన జనసేన శ్రేణులకు అన్యాయం జరుగుతోందని, వైసీపీ నుంచి వచ్చినవారికే పెద్దపీట వేస్తున్నారంటూ సోషల్ మీడియా వేదికగా పోస్టులు హల్‌చల్ చేస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వానికి నామినేటెడ్ పోస్టుల భర్తీ కత్తిమీద సాములాగే ఉంది

పోస్టుల భర్తీపై సీఎం సమీక్ష



నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఇటీవల సీఎం నారా చంద్రబాబునాయుడు అమరావతిలో ముఖ్య నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. మార్చి నెలాఖరుకు నియోజకవర్గస్థాయిలో ఉన్న మార్కెట్ కమిటీలు, దేవస్థానాలు, ఇతర కమిటీల్లో నియామకాలను పూర్తి చేస్తామని ప్రకటించారు. సొసైటీలకు పాలకవర్గాలు, డీసీసీబీ కమిటీలకు సభ్యుల నియామకాన్ని పూర్తిచేసే యోచన ఉంది.

ఆలయ కమిటీల సందడి..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దేవస్థాన ట్రస్ట్ బోర్డు కమిటీలకు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఎందుకంటే గుర్తింపు పొందిన దేవాలయాలు 1713కు పైగా ఉన్నాయి. అన్నవరం, వాడపల్లి, పిఠాపురం, సామర్లకోట భీమేశ్వర స్వామి ఆలయం, ద్రాక్షారామ, అయినవిల్లి, కోటసత్తెమ్మ, అంతర్వేది, అప్పనపల్లి, రాజమహేంద్రవరంలో కోటిలింగేశ్వరస్వామి, ఉమా మార్కెండేయస్వామి వంటి అనేక పెద్ద దేవాలయాలు ఉన్నాయి. గత వైసీపీ హయాంలో ఏం జరిగిందో కానీ రూ.5 లక్షల ఆదాయంకంటే తక్కువ ఉన్న దేవాలయాలకు ట్రస్ట్‌బోర్డుల నియామకం వద్దని అప్పట్లో సుప్రీంకోర్టు ఆర్డర్ ఇచ్చింది. దీనిని పరిగణనలోకి తీసుకుంటే జిల్లాలో 627 వరకూ ఉంటాయి. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని రూ.5లక్షల్లోపు ఆదాయం ఉన్నవాటిని పరిగణనలోకి తీసుకునేటట్టు కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకుంటే 1713 దేవాలయాలకు కమిటీలను నియమించవచ్చు. ప్రస్తుతం ఐదు లక్షలకంటే ఎక్కువ వార్షికాదాయం ఉన్న సుమారు 590 దేవాలయాలకు మాత్రం కమిటీలను వేసే ఆలోచన జరుగుతోంది. తూర్పుగోదావరి జిల్లాలో రూ.7.5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం కలవి 127 ఉన్నాయి. ఇవికాకుండా తక్కువ ఆదాయం గలవి 68 వరకూ ఉన్నాయి. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 5 లక్షల కంటే ఎక్కువ ఆదాయం ఉన్నవి 226, రూ.కోట్లలో ఆదాయం ఉన్నవి 19 ఉన్నాయి. మొత్తం అన్ని రకాలు కలిసి 611 ఉన్నాయి. కాకినాడ జిల్లాలో ఐదు లక్షలకంటే ఎక్కువ ఆదాయం కలవి 200, పెద్దవి 11 ఉన్నాయి. అన్ని రకాలు కలిపి 900 ఉన్నాయి. గత నెలలో సీఎం చంద్రబాబు స్వయంగా ఈ కమిటీలకు పేర్లను ప్రతిపాదించాలని ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలకు సూచించిన సంగతి తెలిసిందే. దీంతో సందడి మొదలైంది.

ఏఎంసీలు.. కార్పొరేషన్లు

మార్కెట్ కమిటీల చైర్మన్ల పదవులకు ఇప్పటికే రిజర్వేషన్ ప్రక్రియ ప్రకారం ఏయే సామాజిక వర్గానికి ఏయే మార్కెట్ కమిటీ ఇవ్వాలనేది నిర్ణయించారు. దాంతో ఎమ్మెల్యేలు కొంత మందికి ముందుగానే అభయహస్తం ఇవ్వడంతో వారి స్థానే భార్యల పేర్లు గానీ, ఇతరుల పేర్లను ప్రతిపాదించడానికి రకరకాల సమస్యలు ఇబ్బందికరంగా మారాయి. ఇక ప్రభుత్వం కొన్ని కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించినప్పటికీ డైరెక్టర్లను నియమించకపోవడంతో వాటికి ఆశావహులు పైరవీలు ప్రారంభించారు. వివిధ సామాజిక వర్గాలకు చెందిన కీలక నాయకులు తమకు కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ల స్థానాలు కల్పించాలంటూ ఒత్తిడి పెంచారు. ఈసారి పదవుల భర్తీలో జనసేనకు ప్రాధాన్యత ఇవ్వకపోతే నియోజకవర్గాల స్థాయిలో ఇబ్బంది వచ్చే పరిస్థితి ఉన్నందున వారిని, అటు బీజేపీని సమన్వయం చేసుకుంటూ పదవులు ఇవ్వాల్సి ఉంది.

నాయకులకు పెను సవాల్..

కీలక దేవస్థానాలకు పాలకమండళ్ల నియామకం సవాళ్లుగా మారుతున్నాయి. ఉదాహరణకు కోనసీమ జిల్లాలో వాడపల్లి, అంతర్వేది, అయినవిల్లి, మురమళ్ల, అప్పనపల్లితోపాటు వివిధ ఆలయాలకు పాలకమండళ్లను నియమించడం ఎమ్మెల్యేలకు శిరోభారంగా మారింది. వీటిలో ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయ పాలకవర్గానికి విపరీతమైన డిమాండ్ ఉండడంతో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆచీతూచీ అడుగులు వేస్తున్నారు. ఇదే తరహా పరిస్థితులు అన్ని నియోజకవర్గాల్లోను నెలకొన్నాయి.

ఒక్కో ట్రస్ట్‌బోర్డుకు 11 మంది

ఒక్కో దేవాలయానికి 11 మంది ట్రస్ట్‌బోర్డు సభ్యులను ప్రభుత్వం నియమించనుంది. చైర్మన్‌తో పాటు 10 మంది సభ్యులు ఉం టారు. దీనివల్ల వేలాది మంది కార్యకర్తలకు పదవులు దక్కనున్నాయి. మూడు పార్టీల నాయకులు అధిష్ఠానం ఆదేశాల మేరకు పంచుకుంటారు. ఈ సారి ట్రస్ట్‌బోర్డుల్లో 50 శాతం మహిళా సభ్యులను నియమించనున్నారు.ఈసారి కొత్తగా నాయీ బ్రాహ్మణులు ఒకరు, బ్రాహ్మణ వర్గానికి చెందిన వారు ఒకరికి తప్పనిసరిగా స్థానం కలిగించేటట్టు ప్రభుత్వం చట్టం చేసింది.మిగిలిన 50 శాతం జనరల్ కేటగిరీలో ఉంటాయి. ప్రతి కమిటీలోనూ ఆలయ పూజారులు ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు.

మద్యం తాగేవాళ్లకు నో చాన్స్

దేవాలయ ట్రస్ట్ బోర్డు కమిటీల్లో మందుతాగే అలవాటు ఉన్నవారికి అవకాశం లేదు. ముఖ్యంగా హిందువై ఉండాలి. కనీసం 25 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. దేవుడిపై విశ్వాసం ఉండాలి. క్రిమినల్ కేసులు ఉండకూడదు. ఎండోమెంట్ భూములు లీజుకు తీసుకుని ఉండకూడదు. బకాయిలు ఉండకూడదు. వారి బంధువులు లీజుదారులై ఉండకూడదు. ఐపీ పెట్టినవారు, కుష్టువ్యాధిగ్రస్తులూ అనర్హులే. ట్రస్ట్ బోర్డులో సభ్యులెవరికీ గౌరవ వేతనం ఉండదు. ఆలయ అభివృద్ధికి, దేవునికి సేవ చేయడమే ప్రధాన లక్ష్యం.

సౌర.. సా..గు!



- కరెంట్ కష్టం తీరనుంది
- రైతులకు తీపికబురు
- పగటిపూటే 9 గంటల విద్యుత్
- 176 కోట్లతో సోలార్ ప్లాంట్లు
- తూర్పు, కాకినాడల్లో ఏర్పాటు
- కోనసీమలో స్థల ఇబ్బంది
- ఏటా రూ.275 కోట్లు ఆదా

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అన్నదాతలకు ఇకపై వ్యవసాయానికి విద్యుత్ బెంగ తీరనుంది. త్వరలో తొమ్మిది గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ వాడుకునే రోజులు రాబోతున్నాయి. ఈ మేరకు ట్రాన్స్‌కో రూ.176 కోట్లతో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించబోతోంది. దీని ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను కేవలం పగటి పూట రైతులు వాడుకునేందుకు మాత్రమే సరఫరా చేయనుంది. తద్వారా రైతులు విద్యుత్ కోసం రాత్రి వేళల్లో పడిగాపులు కాసే పరిస్థితులు తప్పనున్నాయి.

ఉమ్మడి జిల్లాలో 67 వేల కనెక్షన్లు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాపై వ్యవసాయంపై ఆధారపడి ఎక్కువ మంది జీవిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ కనెక్షన్లు 68 వేల వరకు ఉన్నాయి. సాగుకోసం పక్కాగా విద్యుత్ వినియోగిస్తోన్న కనెక్షన్లు 47 వేలు ఉన్నాయి. వీరికి ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఉమ్మడి జిల్లాకు 2.99 లక్షల కిలోవాట్స్ లోడ్ అవసరం అవుతోంది. అంటే 493.22 మిలియన్ యూనిట్లు. ఈ మొత్తం విద్యుత్ అన్నదాతలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నందుకు ఏటా రూ.275.20 కోట్ల వరకు ఆర్థిక భారం పడుతోంది. ఇంత చేసినా తీవ్ర వేసవి సమయంలో వ్యవసాయానికి సైతం కోతలు వేయాల్సిన పరిస్థితి. దీంతో పలుసార్లు పంటలు ఎండిపోయి అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు.

పోలవరం కాలువ వెంబడి..

ఇకపై సాగుకు విద్యుత్ సమస్య ఉత్పన్నం కాకూడదనే లక్ష్యంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాలతో ట్రాన్స్‌కో అధికారులు సోలార్ విద్యుత్‌పై దృష్టిసారించారు. పీఎం కుసుం పథకం కింద సోలార్ విద్యుత్‌ను పగటిపూట తొమ్మిది గంటలపాటు సరఫరా చేయడానికి కొత్త ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వీటి ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌ను అనుసంధానించి దీన్ని పూర్తిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వ్యవసాయ విద్యుత్‌కు మాత్రమే సరఫరా చేయాలని నిర్ణయించారు. మొత్తం 44 మెగావాట్ల సామర్థ్యంతో 16 చోట్ల సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. జగ్గంపేట నియోజకవర్గం గండేపల్లి మండలం మురారీ నుంచి తుని నియోజకవర్గంలోని తేటగుంట వరకు కాలువ వెంబడి 14 చోట్ల సోలార్ పవర్ ప్లాంట్లను రూ.160 కోట్లతో నిర్మించడానికి ప్రతిపాదనలు తయారు చేశారు. కాలువ వెంబడి స్థలం ఐదు నుంచి పదెకరాల వరకు ఉన్న చోట్ల 8 మెగావాట్లు, తక్కువ స్థలం ఉన్నచోట్ల రెండు నుంచి నాలుగు మెగావాట్ల వరకు సోలార్ పవర్ ప్లాంట్లను స్థాపించనున్నారు. రాజమహేంద్రవరంలో కల్వచర్ల, జీవీకే పవర్ ప్లాంట్ ఈ రెండు చోట్ల రూ.8 కోట్లతో నాలుగు మెగావాట్ల సామర్థ్యంలో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించనున్నారు. ఈ సోలార్ ప్లాంట్ల ద్వారా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించి పగటి పూట 9 గంటలపాటు రైతులకు అందించనున్నారు. తద్వారా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 48 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు లబ్ధి కలగనుంది. అటు ప్రభుత్వానికి ఏటా ఉచిత విద్యుత్‌కు అయ్యే రూ.275 కోట్లు ఖర్చు ఆదా కానుంది. ఇక కోనసీమ జిల్లాలో రెండు ప్లాంట్ల నిర్మాణానికి ప్రతిపాదనలున్నా స్థల లభ్యత కష్టంగా మారింది. తొలి విడత ఈ రెండు జిల్లాల్లో సోలార్ పవర్ ప్లాంట్లను నిర్మించనున్నారు. ఇవి అందుబాటులోకి వస్తే రైతులకు పగటిపూట తొమ్మిది గంటలపాటు ఉచిత విద్యుత్‌కు ఢోకా ఉండదు. సోలార్ విద్యుత్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 47 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు లబ్ధి కలగనుండగా, కాకినాడ జిల్లాలోనే 24 వేల మందిరైతులకు సోలార్‌తో మేలు జరగనుంది.



ఐదు ఎత్తిపోతల పథకాలను బాగు చేయాలి : ముప్పిడి

కొవ్వూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సాగు నీరందిస్తున్న 5 ఎత్తిపోతల పథకాలకు పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో మంగళవారం మాట్లాడారు.గడచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎత్తిపోతల పథకాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఎత్తిపోతల పథ కాలకు సకాలంలో మరమ్మతులు చేపట్టి రైతులకు సాగునీరం దించి ఆదుకోవాలన్నారు.కొవ్వాడ కాలువ ఆధునీకరణ చేపట్టాలని కోరారు. కొవ్వూరు రీసర్వే సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబును కలిసి విన్నవించారు.

వివక్ష రూపుమాపేది విద్య

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



గోపాలపురం,మార్చి11 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఆర్థిక అసమా నతలతో పాటు వివక్షను రూపుమాపేది విద్య ఒక్క టేనని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు.అసెంబ్లీలో మంగళవారం మాట్లాడారు.గత పాలకుల అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యాప్రమాణాల్లో నాణ్యత పడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో తీసుకునే ప్రతి మార్పు పేదల జీవితాల్లో వెలుగు తీసుకొస్తుందన్నారు.

నేడు రైల్వే జీఎం వస్తారు.. ఏం చూస్తారో!

రాజమహేంద్రవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ ఈ నెల 12న రానున్న విషయం విదితమే. అయితే ఆయన పర్యటన వస్తారు..వెళ్తారు.. అనే మాదిరిగా సాగనుంది. గతంలో జీఎం తనిఖీలు ఉంటే స్టేషన్ ఆసాంతం పరిశీలించడం జరిగేది.ఉద్యోగుల క్వార్టర్లతో సహా అన్నిటినీ ముస్తాబు చేసేవాళ్ల. ప్రయాణికుల సదుపాయాలు, ట్రాక్‌లు, యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్, పరిశుభ్రత, ఆహారం, ధరలు వంటివి జీఎం, ఆయనతో పాటు ఉండే ఉన్నతాధి కారులు గమనించి తగు చర్యలు తీసుకోవడం ఉండేది. ఇప్పుడు నిధుల కొరత వల్ల భద్రతా పనులకే పరిమిత మయ్యారని అంటున్నారు. దీంతో ఎన్నో నెలల నుంచీ పనిచేయకపోయినా పట్టింపులేకుండా ఇప్పుడు జీఎం వస్తున్నారని ఓ మూడు పరిశుభ్రత యంత్రాలను తీసు కొచ్చి పెట్టారు. బాగానే ఉన్న కుర్చీలను సైతం తీసేసి స్టీలు కుర్చీలు వేశారు. నిధుల కొరత వల్ల ఉన్నంతలో సరిపెట్టారు. వాస్తవానికి ఆయన గత నెల 9న రావాల్సి ఉంది. కానీ కొన్ని పనులు పూర్తి కాకపోవడంతో తేదీ లను పొడిగిస్తూ వచ్చారు. ముఖ్యంగా రాజమండ్రి రైల్వే స్టేషన్‌ని రూ.273 కోట్లతో తీర్చిదిద్దనున్నారు. వీటిని పుష్కరాలకు.. అంటే ఇంకా రెండేళ్లలో ఎట్టి పరిస్థితు ల్లోనూ పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో జీఎం రాజమండ్రిలో ఎంత వరకూ సమయం గడుపుతారో అనే సందేహం ఉత్పన్నమవుతోంది. అభివృద్ధి పనుల్లో భాగంగా తూర్పు రైల్వే స్టేషను వైపు భవనానికి జీఎం వచ్చినప్పుడు శంకుస్థాపన చేయించాలని అనుకున్నా అదీ జరిగేట్లు లేదు. ఎందుకంటే అభివృద్ధి పనులు టెండర్ స్థాయిని దాటలేదు. జాంపేట బ్రిడ్జి కింద ప్రాంతంలో ట్రాక్ పనులు పెండింగ్ ఉండడం వల్ల మరో దారిలో ఆయ నను తీసుకెళ్లడానికి ఆలోచన చేశారని తెలుస్తోంది. రాజమండ్రి 10.45 గంటలకు వచ్చి 11.30 గంటలకు వెళతారు. ఏడాదికి ఒకసారి తనిఖీలకు వచ్చే జీఎం కేవలం 45 నిమిషాలు మాత్రమే ఇక్కడ కేటాయించే విధంగా ప్రణాళిక వేశారు.

భద్రతా పనులకే ప్రాధాన్యం - స్టేషన్ పరిశీలన లేనట్లేనట - 45 నిమిషాలే తనిఖ




రాజమండ్రి స్టేషన్‌లో చాలా కాలంగా పారిశుధ్య యంత్రాల్లేవ్.. పాతవాటితోనే కుస్తీపడుతున్నారు.. అయితే బుధవారం జీఎం వస్తున్నారని కొత్తవి తెచ్చిపెట్టారు..

నిడదవోలు జంక్షన్ ఆగని రైళ్లతో టెన్షన్

నేడు నిడదవోలుకు రైల్వే జీఎం రాక



నిడదవోలు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు రైల్వే జంక్షన్ పేరుకు మాత్రమే.. సూపర్ ఫాస్ట్ రైలు ఎక్కాలంటే ప్రయాణికులు పక్క స్టేషన్‌కు వెళ్లాల్సిందే. స్టేషన్‌కు ఆదాయం బాగానే ఉన్నా రైళ్లు ఆగకుండానే వెళ్లి పోతుంటాయి.నిడదవోలు జంక్షన్ మీదుగా సుమారు రోజుకి 75 రైళ్ళ వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే దూర ప్రాంతాలకు వెళ్లేందుకు ఉన్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్ట్ లేకపోవడంతో ప్రయాణికులు అటు రాజమహేంద్రవరం ఇటు తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లకు వెళ్లి రాకపోకలు సాగిస్తున్నారు.దీంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గూడ్స్‌ల ద్వారా సంవత్సరానికి సుమారు రూ.12 కోట్లు, ప్రయా ణికుల ద్వారా సంవత్సరానికి సుమారు రూ.15.60 లక్షలు ఆదాయం వస్తుంది. అయితే నిడదవోలు జంక్షన్ మీదుగా ముంబాయి, సికింద్రాబాద్ లాంటి ప్రాంతాలకు వెళ్ళే సూపర్ ఫాస్ట్ రైళ్ళు ఆగడంలేదు. కాకినాడ - లిం గంపల్లి (కోకనాడ ఎక్స్‌ప్రెస్),విశాఖపట్టణం - లిం గంపల్లి (జన్మభూమి), కాకినాడ - ముంబాయి (సీవో ఎల్‌టి), విశాఖపట్టణం - ముంబాయి (ఎల్‌టీటీ) రైళ్ళకు హాల్ట్‌లు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు. రైల్వే జీఎం బుధవారం మధ్యాహ్నం 1.15 నుంచి 2 గంటల వరకు నిడదవోలులో ఆగనున్న నేపథ్యంలో కూ టమి నాయకులు నిడదవోలులో సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్‌ల హాల్ట్‌కు సంబంధించి విన్నవించాలని ప్రజలు కోరుతున్నారు. నిడదవోలు రైల్వే స్టేషన్‌కు కేంద్ర ప్రభుత్వం అమృత భారత్ పథకం ద్వారా సుమారు 27 కోట్ల నిధులు మంజూరు చేసింది.దీంతో ఈ నెలాఖరుకి పనులు పూర్తి చేసే లక్ష్యంతో స్టేషన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

నిందితులు, ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

ఎల్‌ఏడీసీ సేవలు వినియోగించుకోవాలి : శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ (ఎల్‌ఏడీసీ) సేవలను నిందితులు, ఖైదీలు వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. సెంట్రల్ జైలు, మహిళా ప్రత్యేక కారాగారాలను మంగళవారం ఆమె సందర్శించారు.ఆహారం, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఖైదీలు, వాళ్ల కుటుంబ సభ్యులతో మాట్లాడారు.ఖైదీల తరపున ఉచితంగా వాదించడానికి న్యాయవాదుల ఏర్పాటుకు, బెయిల్ పిటీషన్లు, హైకోర్టుల్లో అప్పీలు చేయడం తదితర న్యాయ సహాయం కోసం డీఎల్ఎస్ఏని సంప్రదించాలన్నారు.జైలులో నియ మించిన పారా లీగల్ వలంటీర్ల ద్వారా అర్జీలను అందజేయాలని సూచించారు. సేవలు ఉచితంగా అందజేస్తారన్నారు.


IndusInd Bank ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్
1-10-72, 3వ అంతస్తు, అశోకా జనార్దన చాంబర్స్, బేగంపేట, హైదరాబాద్ - 500016

డిఫాల్టర్ రుణగ్రహీత/డైరెక్టర్లు/హామీదారులకు నోటీసు
బలరామ్ ఎంటర్‌ప్రైజెస్, తూర్పు గోదావరి జిల్లా యొక్క యజమాని మరియు హామీదారులు

నమోదిత కార్యాలయం: నం.5/44, కవేరి వీధి, రామాలయం, కొమరిపాలెం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్; (1) శ్రీ పడాల బలరామకృష్ణ రెడ్డి (యజమాని & హామీదారు), నివాసం: ఇ.నం.5/45, కవేరి వీధి, కొమరిపాలెం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్; (2) శ్రీమతి పడాల భాగ్యలక్ష్మి (హామీదారు), నివాసం: ఇ.నం.5/45, కవేరి వీధి, కొమరిపాలెం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్; (3) శ్రీ సతి పోతరెడ్డి (హామీదారు), నివాసం: ఇ.నం.7-448, పిల్లకాలవ వీధి, అనపర్తి పోస్ట్ మరియు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533342, ఆంధ్రప్రదేశ్; (4) శ్రీ సతి పెంపారెడ్డి (హామీదారు), నివాసం: ఇ.నం.7-472, పిల్లకాలవ వీధి, అనపర్తి పోస్ట్ మరియు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533342, ఆంధ్రప్రదేశ్; (5) శ్రీమతి పి. వీరాయమ్మ (హామీదారు), నివాసం: ఇ.నం.5-46, శివాలయం వీధి, బిక్కవోలు మండలం, కొమరిపాలెం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్; (6) శ్రీ పి. బ్రహ్మారెడ్డి (హామీదారు), నివాసం: ఇ.నం.5-46, తేతాలావారి వీధి, బిక్కవోలు మండలం, కొమరిపాలెం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్; (7) శ్రీమతి పి. అనసూయ (హామీదారు), నివాసం: ఇ.నం.5-46, తేతాలావారి వీధి, బిక్కవోలు మండలం, కొమరిపాలెం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్.


పడాల బలరామకృష్ణ రెడ్డి (యజమాని & హామీదారు)


శ్రీమతి పడాల భాగ్యలక్ష్మి (హామీదారు)


శ్రీ సతి పోతరెడ్డి (హామీదారు)

బలరామ్ ఎంటర్‌ప్రైజెస్, బిక్కవోలు, తూర్పు గోదావరి జిల్లా; నమోదిత కార్యాలయం: నం.5/44, కవేరి వీధి, రామాలయం, కొమరిపాలెం, బిక్కవోలు మండలం, తూర్పు గోదావరి జిల్లా - 533346, ఆంధ్రప్రదేశ్ వారు ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్ నుండి రుణం పొందారని మరియు 28.02.2025 నాటికి రూ. 5,69,08,960.56/- (రూపాయలు ఐదు కోట్ల అరవైతొమ్మిది లక్షల ఎనిమిది వేల తొమ్మిది వందల అరవై మరియు యాభైఆరు పైసలు మాత్రమే)లను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారని సమస్త ప్రజానీకానికి ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది.
అధీకృత అధికారి, ఇండస్‌ఇండ్ బ్యాంక్ లిమిటెడ్

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

వైభవంగా నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు


భక్తులకు దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహస్వామి

కోరుకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. రెండోరోజు మంగళవారం స్వామివారిని పెద్ద సంఖ్యలో భక్తులు కొండపైన, కొండ దిగువన దర్శించుకున్నారు. ఉదయం స్వామివారికి ఆరాధన, సర్వదర్శనం, గ్రామబలిహరణ, సేవాకాలం, తీర్థగోష్ఠి నిర్వహించారు.వేలసంఖ్యలో కొండపైకి భక్తులు వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అదే విధంగా స్వామివారి కళావేదికపై కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు.

గరుడవాహనంపై స్వామి గ్రామోత్సవం

కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారు కల్యాణం అనంతరం రెండోరోజు మంగళవారం రాత్రి 8గంటలకు గరుడ వాహనంపై ఆశీనులై గ్రామోత్సవం చేశారు. ఆగమ బ్రహ్మపాణింగపల్లి పవన్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో పెద్దింటి, పెరవళి, పెదపాటి అనువంశక అర్చక స్వాములు స్వీయ పర్యవేక్షణలో పాచాన్నిక దీక్షతో వైకానస ఆగమం, శ్రీ వైష్ణవ సాంప్రదాయం వైభవంగా స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అనువంశక ధర్మకర్త పరాసర రంగరాజ భట్టర్, లక్ష్మీనరసింహభట్టర్, రఘునాధ భట్టర్‌లు గరుడవాహనంపై ఆశీనులైన స్వామివారికి మంగళనీరాజనాలు పాడారు.

అలరించిన పండిత సభలు

కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో శ్రీ రంగనాధస్వామి ఆలయం ముందు ఉదయం 9.30నుంచి 12.30వరకు సాయంత్రం 4 గంటల నుంచి 7.30 వరకు విశిష్టాద్వైత పండిత సభలు పరాసర లక్ష్మీనరసింహస్వామి, రఘునాధ భట్టర్‌స్వామిలు తదితర ఉభయ వేదాంత పండితులు ఉపన్యసించారు. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం స్వామి వారికి ప్రత్యేక సేవాకాలం, తీర్థగోష్ఠి జరిగింది. భక్తులు ఈ పండిత సభల్లో పాల్గొన్నారు


గరుడవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

మట్టి అక్రమ తవ్వకాలను అరికట్టాలి

• ఫిర్యాదుచేసినా పట్టించుకోవడంలేదని గ్రామస్థుల ఆందోళన
• పనులను అడ్డుకున్న గ్రామస్థులు

కొవ్వూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు మండలం చిడిపి గ్రామంలో గోదావరి మధ్య లంకలలో అక్రమంగా చేపట్టిన మట్టి తవ్వకాలను మంగళవారం గ్రామస్థులు అడ్డుకున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టాలని నినాదాలు చేస్తూ డిమాండ్ చేశారు. 97 మంది రైతులకు పట్టాలు ఇచ్చిన భూములను ఆనుకుని ఇసుక తవ్వకాల పేరిట మట్టి అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. అధికారులకు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదన్నారు. సుమారు 10 అడుగుల మేర లంకలలో మట్టి తవ్వకాలు చేపట్టారన్నారు. దీంతో తమకు కేటాయించిన భూములకు నష్టం కలుగుతుందని వాపోయారు. అక్కాబత్తుల రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా లంక భూములు ఖాళీగా ఉన్నాయి. 2024లో 97 మందికి సాగు చేసుకోవడానికి పట్టాలు ఇచ్చారు. సంవత్సరంలో 6 నెలలలో ఈ భూములలో మొక్కజొన్న, పొగాకు, ఆకు కూరలు సాగు చేశామన్నారు. అటువంటి భూములను ఆనుకుని ఇసుకర్యాంపులకు బాటలు వేయడానికి గత మూడు రోజులుగా మట్టిని తవ్వుతున్నారు. ప్రశ్నిస్తే ఇసుక ర్యాంపుకు రోడ్డు వేస్తున్నామని చెబుతున్నారన్నారు. ప్రభుత్వం సహకరించి అక్రమమట్టి రవాణాను అరికట్టాలని కోరుతున్నారు. దీనిపై తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్నారని సమాచారం రావడంతో దొమ్మేరు వీఆర్వో సుబ్రహ్మణ్యం, టాస్క్‌ఫోర్సు ఏఎస్ఐ శ్రీనివాస్‌లను పంపించామన్నారు. రెవెన్యూ, పోలీసు సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునే సరికి తవ్వకాలు చేపట్టిన వాహనాలు, ఆందోళనకారులు లేకపోవడంతో సిబ్బంది వెనుదిరిగారన్నారు. అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు చేపట్టిన వారిపై, ఎక్స్‌కవేటర్, మట్టి తరలిస్తున్న లారీల నంబరు ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని తహసీల్దార్ తెలిపారు.


చిడిపి గోదావరి లంకలో మట్టి తరలిస్తున్న లారీని అడ్డుకున్న గ్రామస్థులు


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్సు ఏఎస్ఐ శ్రీనివాస్

విద్యార్థులకు ప్రతిభాపాటవ పరీక్షలు

ఉండ్రాజవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం నెం.1 పాఠశాలలో మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో 5వ తరగతి చదివే విద్యార్థులకు గన్నమని శేషగిరారావు ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల నుంచి 75 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను మండల విద్యాశాఖాధికారిణి డి.శారదా జ్యోత్స్న పర్యవేక్షించారు.

సెకండరీ హెల్త్ ఆసుపత్రులలో కాంట్రాక్టు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కొవ్వూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆసుపత్రులలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ ఎన్.పి. పద్మశ్రీ తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ 1, ఆడియో మెట్రీషియన్ పోస్టులు 2, (కాంట్రాక్టు పద్ధతిన) బయో స్టాటిస్టిషన్ 1, థియేటర్ అసిస్టెంట్ 1, జనరల్ డ్యూటీ అటెండెంటు 22, ఆఫీసు సబార్డినేట్ 3, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఒక సంవత్సరం కాలానికి భర్తీ చేయడానికి నోటిఫికేషన్ జారీ చేశారు. ఆశక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఈస్ట్‌గోదావరి డాట్‌ఎన్‌ఐసి డాట్‌ఇన్ వెబ్‌సైట్‌లో పొందగలరు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 13వ తేదీ ఉదయం 10-30 నుంచి మార్చి 21వ తేదీ సాయంత్రం 5గంటలలోపు కొవ్వూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లోని జిల్లా వైద్యసేవల సమన్వయాధికారి కార్యాలయంలో అందించాలన్నారు.

గుండెపోటుతో ఉపాధి కూలి మృతి


బొందల చంద్రకాంత (ఫైల్)

దేవరపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఉపాధి హామీ కూలి మృతి చెందిన సంఘటన దేవరపల్లి మండలం పల్లంట్లలో చోటుచేసుకుంది. పల్లంట్ల గ్రామానికి చెందిన బొందల చంద్రకాంత(50) మంగళవారం ఉదయం ఉపాధి హామీ పనులకు వెళ్లి పనిచేస్తుండగా తీవ్రంగా గుండెలో నొప్పి రావడంతో తోటి కూలీలు ఆమెను చికిత్స నిమిత్తం ఊరిలోకి తీసుకొస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది. సంఘటనా ప్రాంతాన్ని ఎన్ఆర్‌జీఎస్ ఏపీవో శ్రీనివాస్ సందర్శించి బొందల చంద్రకాంత మృతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గుండెపోటుతో మృతి చెందడంతో ఈ విషయాన్ని డ్వామా పీడీ నాగమహేశ్వరరావుకు తెలియజేసినట్లు తెలిపారు. మృతురాలు చంద్రకాంతకు భర్త, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అందరికీ వివాహాలు అయ్యాయి. ఆమె భౌతిక కాయాన్ని గ్రామ సర్పంచ్ నూతలపాటి వెంకట్రమణ, వీఆర్వో శాంతి, కార్యదర్శి ఇమ్రాన్, సందర్శించారు.

ప్రాథమిక విద్యా విధానంలో మార్పులు పునరాలోచించాలి

• మండల సమావేశంలో సభ్యుల వినతి

నల్లజర్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యా విధానంలో ప్రభుత్వం తీసుకున్న 5 రకాల బడులు విధాన నిర్ణయాన్ని పునరాలోచన చేయాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల పరిషత్ సమావేశం దృష్టికి తీసుకుని వచ్చారు. మంగళవారం నల్లజర్ల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీ పీ బంకా జయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఎంఈవో-2 భగవతి విద్యాశాఖ ప్రగతిసభకు వివరిస్తుండగా ప్రాథమిక విద్యావిధానంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు విద్యార్థుల కు ఇబ్బందికరంగా ఉన్నాయని దీనిపై పునరలోచన చేయాలని ఆవపాడు సర్పంచ్ ఆచ్యుత సత్యనారాయణ, ప్రకాశరావుపాలెం సర్పంచ్ జార్జి విక్టర్, తెలికిచర్ల సర్పంచ్ బండి చిట్టి విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ ప్రకాశరావుపాలెం-తూర్పుచోడవరం రహదారి 5కి.మీ మేర అభివృద్ధికి రూ.3కోట్లు, ప్రకాశరావుపాలెం-తెలికిచర్ల 3కి.మీ రహదారి అభివృద్ధికి రూ.2.5కోట్లు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఏవో కమల్ రాజ్ మాట్లాడుతూ మార్చినెల చివరిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. రెవెన్యూశాఖ తరుపున డీటీ శాంతిప్రియా, ఆరోగ్యశాఖ తరుపున సీహెచ్‌వో ప్రసాదరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అజేయబాబు తమ శాఖల ప్రగతిని వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సింహాద్రిరావు, వైస్ ఎంపీపీ ఆచ్యుత శివాజీ, సర్పంచ్‌లు నందమూరి శారదాదేవి, చెల్లారి శ్రీను, అల్లూరి సూర్యరావు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బంకా జయలక్ష్మి

నెలాఖరులోగా రీ సర్వేపై అభ్యంతరాలు తెలపాలి

• కొవ్వూరు తహసీల్దార్ దుర్గాప్రసాద్

కొవ్వూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఈ నెలాఖరులోగా రీ సర్వేపై అభ్యంతరాలను తెలపాలని కొవ్వూరు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ అన్నారు. కొవ్వూరు మండలం నందమూరు గ్రామంలో మంగళవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ వీధులలో ర్యాలీ చేశారు. తహసీల్దార్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ నందమూరు గ్రామంలో రీసర్వేకు సంబంధించి గ్రౌండ్ టూతింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని, ఎవరెవరికి ఎంత విస్తీర్ణం వచ్చిందో తెలియజేస్తూ రైతులకు నోటీసులు అందించామన్నారు. నోటీసులు అందుకున్న రైతులు గ్రామ సచివాలయంలో ఈ నెలాఖరులోగా అభ్యంతరాలను తెలియజేయాలన్నారు. రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలను రీసర్వే డీటీ పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఈ సమావేశంలో గ్రామ సర్పంచ్ కంటిపూడి గంగ భవాని, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ టి.వెంకటేశ్వరరావు, సర్వే డి.ఐ.వెంకటేశ్వరరావు, రీసర్వే డీటీ టి. కృష్ణ, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


నందమూరులో ర్యాలీ నిర్వహిస్తున్న తహసీల్దార్ దుర్గాప్రసాద్

గౌతమేశ్వరాలయాన్ని జీర్ణోద్ధారణ చేయాలి

• హిందూ ధర్మ ప్రచారకుడు రాధా మనోహరదాస్

తాళ్లపూడి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి గోదావరి గట్టు వద్దగల గౌతమేశ్వరస్వామి ఆలయం జీర్ణోద్ధారణ చేయించాలని గోదావరినదీ తీరంలో గల ఈ ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని హిందూ ధర్మ ప్రచారకుడు శ్రీరాధా మనోహరదాస్ అన్నారు. ఆయన తాళ్లపూడిలో మంగళవారం స్థానిక శ్రీమదన గోపాలస్వామి ఆలయంలో కల్యాణ ఉత్సవం సందర్భంగా ప్రవచనం చేసేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా గోదావరినదీ తీరం లో పాడు బడ్డట్టుగా ఉన్న గౌతమేశ్వర స్వామి ఆలయాన్ని గ్రామస్థులు, పెద్దలు సంఘటితమై ఆలయ జీర్ణోద్ధారణకు పూనుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గత కొంతకాలంగా ఈ ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తున్న కవల శ్రీనివాస్, రాధాకృష్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

• శ్రీమదనగోపాలస్వామి ఆలయంలో మంగళ వారం ఉదయం శ్రీరాధా మనోహరదాస్ ప్రవచనం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై పుట్టిన ప్రతిఒక్కరూ భగవంతుడిని కొలవాలని ముక్తి మార్గం పొందే విధానాల గురించి చేసిన ప్రవచనం ఆద్యంతం ప్రతి భక్తునుడిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


ఆలయం వద్ద గ్రామస్థులతో మాట్లాడుతున్న రాధామనోహరదాస్

హోంగార్డుకు పూర్వ విధులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రాజమహేంద్రవరం, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఓ హోంగార్డుపై ఎస్ఐ దాష్టీకానికి పాల్పడడంపై 'ఆంధ్రజ్యోతి'లో 'హోంగార్డుపై ఎస్ఐ ప్రతాపం' శీర్షికన మంగళవారం వార్త వెలువడిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు సానుకూలంగా స్పందించారు. అతడిపై భౌతిక దాడికి దిగడంతోపాటు విధులకు కూడా భంగం కలిగించడంపై ఆత్మ పరిశీలన చేసుకున్నారు. ఈ ఘటన జరగకముందు ఉన్న విధులకు ఆయనను పంపిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే, కనీసం ప్రాథమిక ఆరా లేకుండా చిన్నస్థాయి ఉద్యోగిని చితక బాది, ప్రభుత్వాస్పత్రిలో మెడికో లీగ్ కేసు కూడా నమోదు కాకుండా అడ్డుపడిన సీఐ, ఎస్ఐ, కానిస్టేబుళ్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ నరసింహకిషోర్‌కి హోంగార్డులు విన్నవిస్తున్నారు.

ప్రజల తాగునీటి అవసరాలకు
ప్రెస్‌క్లబ్‌కు మోటారు బహూకరణ

కొవ్వూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజల తాగునీటి అవసరాలకు ప్రెస్‌క్లబ్‌కు వాసవీక్లబ్ అధ్యక్షుడు మన్యం వీరభద్రగుప్తా మోటారు బహూకరించారు. కొవ్వూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కూలింగ్ వాటర్ పథకానికి సంబంధించి మోటారు మరమ్మతులకు గురైంది. వాసవీక్లబ్ జోనల్ చైర్మన్ అధికారిక పర్యటనలో భాగంగా కొవ్వూరు వాసవీక్లబ్ అధ్యక్షుడు మన్యం వీరభద్ర గుప్తా ఆఫ్ హెచ్‌పీ మోటారును బహూకరించారు. మంగళవారం ప్రెస్‌క్లబ్ వద్ద జరిగిన కార్యక్రమంలో వాసవీక్లబ్ జోనల్ చైర్మన్లు కాకి అనీల్‌సూర్య, వలివేటి ప్రసాద్, దేవతు కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ కొవ్వూరు ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏడాది పొడవునా ప్రజలకు ఉచితంగా కూలింగ్ వాటర్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. వాసవీక్లబ్ తమ వంతుగా మోటారును అందించడంపట్ల వాసవీక్లబ్ సభ్యులను అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు మన్యం వీరభద్రగుప్తా, సత్యవరపు గురునాథ్, భరత్, టి.రవికుమార్, రాఘవ రామాకాంత్, చెక్కా సూర్యగౌతమ్, వి.నాగబాబు పాల్గొన్నారు.


కొవ్వూరు ప్రెస్‌క్లబ్‌కు మోటారు బహూకరిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

తూర్పుచోడవరం హైస్కూల్ హెచ్ఎం మృతి


జీఎస్‌వీ రవికుమార్(ఫైల్)

నల్లజర్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): తూర్పుచోడవరం హైస్కూల్ హెచ్ఎం జీఎస్‌వీ రవికుమార్(50)మంగళవారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన స్వగ్రామం చాటపర్రులో బుధవారం అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా ఇదే పాఠశాలలో హెచ్ఎంగా పని చేస్తున్నారు. విషయం తెలిసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

WANTED
WANTED MALE/FEMALE MARKETING EXCUTIVES FOR REPUTED SCHOOL IN TALLAPUDI CONTACT:
99484 87789

జనసేన ఆవిర్భావ సభకు జన సమీకరణ చేయాలి

• నియోజకవర్గ కన్వీనర్ సువర్ణరాజు

నల్లజర్ల, మార్చి11 (ఆంధ్రజ్యోతి): జనసేన ఆవిర్భావ సభకు నియోజక వర్గం నుంచి జన సమీకరణ చేయాలని నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు పిలుపునిచ్చారు. ఈనెల 14న పిఠాపురం మండలం చిత్రాడలో జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సభకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన నల్లజర్లలో మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు చోడసాని బాపిరాజు సమక్షంలో విడుదల చేశారు. సువర్ణరాజు మాట్లాడుతూ జనసేన గెలిచిన తరువాత మొదటిగా జరుగబోయే ఆవిర్భావ దినోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి బస్సు ఏర్పాటుచేస్తామని అందరూ బస్సులు దేవరపల్లి డైమండ్ జంక్షన్‌వద్ద ఆగి చింతలపూడి, పోలవరం నియోజకవర్గ జనసైనికులు నాయకులతోపాటు గోపాలపురం నియోజకవర్గ నాయకులు,కార్యకర్తలు, వీరమహిళలు భారీ ర్యాలీగా సభాస్థలానికి చేరుకోవాలని సూచించారు. ఐటీ విభాగం అధ్యక్షుడు సత్యకిరణ్, సత్యనారాయణ, సత్తిబాబు, కిషోర్, ఉన్నమట్ల ఇస్సాకు, వరుణ్, రుద్ర శ్రీను, బండి చిట్టి, సిందెల్ కుమారి పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న నియోజక వర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు

'సమాచారహక్కు' ముసుగులో బెదిరింపులు

• పోలీసులకు ఫిర్యాదు చేసిన సర్పంచ్‌లు, కార్యదర్శులు

నల్లజర్ల, మార్చి 11(ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లుగా సమాచార హక్కచట్టం ఉపయోగించుకుని సమాచారం కావాలని పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులను నిడవర్రు గ్రామానికి చెందిన సంకేళ్ళ రాంబాబు, అతని అనుచరులు దుర్గా బెదిరింపులకు పాల్పడుతున్నారని మండలంలోని సర్పంచ్‌లు మంగళవారం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా అన్ని పంచాయతీల మీద రూ.10లక్షలు నగదు ఇవ్వాలని లేకపోతే ఆయా గ్రామాల సర్పంచ్‌లు అక్రమాలకు పాల్పడుతున్నారని లేని ఆరోపణలుచేసి పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది కి ఉదయం 4గంటలకు ఫోన్‌చేసి బెదిరిస్తున్నారని, మహిళా కార్యదర్శులపట్ల అసభ్య పదజాలంతో దూషిస్తున్నారన్నారు. సంకెళ్ళ రాంబాబు దుర్గాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు కె.జాన్‌విక్టర్ బాబు, ఆచ్చుత సత్యనారాయణ, గద్దె తిలక్, బండి చిట్టి, తానిగడప బాలయ్య ఇతర సర్పంచ్‌లు ఫిర్యాదు చేశారు.

'మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి'

ఉండ్రాజవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి పేర్కొన్నారు. మండలంలోని పాలంగి గ్రామంలో భైర్రాజు ఫౌండేషన్, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ మహిళలు కుట్టు శిక్షణ పొంది ఉపాధి మార్గాన్ని ఎంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ బొక్కా శ్రీనివాస్, ఫౌండేషన్ నోడల్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరావు, స్థానిక నాయకులు ఈద్పుగంటి ఉదయకుమార్, పాలాటి శరత్ బాబు, దిద్దే మధుబాబు, పంచాయతీ కార్యదర్శి ఎండీ హసన్ జాని, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.


పాలంగిలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గృహోపకరణాల గోదాములో అగ్నిప్రమాదం

రాజమహేంద్రవరం,మార్చి 11(ఆంధ్రజ్యోతి): జాతరకు కాల్చిన బాణసంచావల్ల ఓ ప్లాస్టిక్ గృహోపకరణాల గోదాములో మంగళవారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. ఫైర్ అధికారులు, ప్రత్యక్ష సాక్షి విజయ్‌కుమార్ ప్రాథమిక సమాచారం మేరకు.. రాజమహేంద్రవరంలో పాత సోమాలమ్మ ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బాణసంచా కాల్చారు. ఓ తారాజువ్వ దేవాలయం ఎదుటి సందులో ఉన్న హర్షిత ప్లాస్టిక్ ఎంటర్‌ప్రైజెస్ గోదాము ప్రాంగణంలోని ఓ ఎండిపోయిన కొబ్బరి చెట్టుపై పడింది. అది రాజుకొని నిప్పులు కింద కొబ్బరి మట్టల్లో పడ్డాయి. అప్పటికే కింద ఉన్న కొబ్బరిమట్టల్లో మంట చెలరేగింది. చెట్టు పక్కనే ఉన్న ప్లాస్టిక్ డ్రమ్ములకు మంటలు అంటుకున్నాయి. గోదాము ప్లాస్టిక్ గృహోపకరణాలు కావడంతో వేగంగా మంటలు చెలరేగాయి. ప్రాంగణంలోని ప్లాస్టిక్ డ్రమ్ములకు మూతలు ఉండడంతో పెద్దశబ్ధంతో పేలడంతో చుట్టు పక్కల ఇళ్లల్లోని నివాసితులు బయటికి పరుగులుపెట్టారు. ఈలోపు ఫైర్ కొవ్వూరు, ఇన్నీసు పేట, ఆర్యాపురం ఫైర్ ఇంజన్లతో సిబ్బంది చేరుకొని సుమారు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఆస్తి నష్టం సుమారు రూ.20లక్షల వరకూ ఉంటుందని యజమాని చెబుతున్నారని, ఆధారాలను పరిశీలించిన తర్వాత నిర్ధారిస్తామని చీఫ్ ఫైర్ ఆఫీసర్ మార్టిన్ లూథర్‌కింగ్ పేర్కొన్నారు. గోదామును ఓ పాత భవనంలో ఎలాంటి అగ్నిమాపక రక్షణ వ్యవస్థ లేకుండా నిర్వహిస్తున్నారని చెప్పారు.

వైభవంగా మదన గోపాలస్వామి రథోత్సవం


మదన గోపాలస్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తాళ్లపూడి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తాళ్లపూడిలో ఉన్న శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ మదనగోపాలస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం మంగళవారం సాయంత్రం ఆలయానికి గోకవరపు వంశస్తులు అందించిన రథంలో స్వామివారిని ఊరేగిస్తూ రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సింహాద్రి జనార్ధనరావు, గ్రామ సర్పంచ్ నక్కా అనురాధా చిట్టిబాబు, ఉప సర్పంచ్ అప్పన జగదీష్, ధర్మవరం ఇస్కాన్ ప్రతినిధి శ్రీకృష్ణ మాధవదాస్, గోకవరపు మాణిక్యం, గోకవరపు శ్రీనివాస్, కంకిపాటి సాయి వినయ్, అనంతం సాయికుమార్, శ్రీకాంత్, వంశి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు లయన్స్‌క్లబ్ కృషి

కొవ్వూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కు లయన్స్‌క్లబ్ పాటుపడుతుందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. మంగళవారం కొవ్వూరు లిటరరీ క్లబ్ కళ్యాణ మండపంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మద్దిపాటి సత్యనారాయణ అధ్యక్షతన జిల్లా గవర్నర్ వార్షిక అధికారిక పర్యటన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు మహిళలకు గవర్నర్ చేతులు మీదుగా కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పాలింపాటి చినబాబు, మద్దుకూరి శ్రీహరి, సెక్రటరీ నామాన బుల్లిరాజు, పరిమి హరిచరణ్, గోలి వెంకటరత్నం, సూరపనేని చిన్ని, కంటమణి రామకిషోర్, మన్యం బుల్లిబాబు, యనమదల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


మహిళలకు కుట్టుమిషన్లు బహూకరిస్తున్న లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు

నగరపాలక సంస్థ రాజమహేంద్రవరం

ఆర్.ఒ.సి.నెం.323/2025-ఎ16 తేది:10-03-2025

వేలం నోటీసు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలో గల ఈ దిగువ తెలిపిన మార్కెట్లకు 2025-26 సంవత్సరమునకు గుత్తేదార్లకు స్వాధీనము చేసిన నాటి నుండి 31-03-2026 వరకు ఆశీలు వసూలు చేసుకొనే గుత్తహక్కు నిమిత్తం ది.28-03-2025వ తేది ఉదయం గం.11:00 నుండి నగరపాలక సంస్థచే ప్రకటించబడిన గజిట్ నోటిఫికేషన్ నెం.08/2025 లోని రేట్లు మరియు షరతులకు లోబడి శ్రీయుత కమిషనరు వారు కాని వారిచే అనుమతి పొందిన అధికారి వారిచే కాని వేలము నిర్వహించబడును. మరియు గుత్తదారుడు పాట మొత్తమునకు స్వీపర్ ఛార్జీలు అదనము మరియు వాటి మొత్తముపై 18% జి.ఎస్.టి. అదనము.

వ.నెం.	మార్కెట్టు పేరు	ధరావత్తు రూ.	బ్యాంకు గ్యారంటీ రెండు సంవత్సరములకు (రూ)
1	జాంపేట మార్కెట్టు	3,75,000	5,00,000
2	సెంట్రల్ విజిటబుల్ మార్కెట్టు	5,00,000	7,00,000
3	నాగులచెరువు మార్కెట్టు	7,00,000	9,00,000
4	ఆల్కట్ గార్డెన్స్ మార్కెట్టు	2,00,000	3,00,000
5	జలపుష్ప భవనము (హోల్ సేల్ చేపల మార్కెట్టు)	40,000	75,000
6	క్వారీ మార్కెట్టు	12,000	25,000
7	ఎం.ఎ. మార్కెట్టు	1,00,000	1,50,000
8	అరటిపండ్ల మార్కెట్టు	4,50,000	6,00,000

ఆసక్తి గలవారు ది.27-03-2025వ తేది సాయంత్రం గం.4:00 ల లోపు ధరావత్తు సొమ్ము (కమిషనరు,నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం వారి పేరున) డిమాండ్ డ్రాఫ్ట్ మరియు నిర్దేశించిన సొమ్ముకు బ్యాంకు గ్యారంటీ సమర్పించి షెడ్యూల్ పొందవచ్చును. ఏ కారణము తెలుపకయే వేలమును వాయిదా వేయుటకు లేదా రద్దుపరచుటకు నగరపాలక సంస్థ, కమిషనరు వారికి పూర్తి అధికారము కలదు. ఇతర వివరముల కొరకు కార్యాలయము పనిచేయు వేళలలో రెవెన్యూ ఆఫీసరు-1 గారిని సంప్రదించవచ్చును.

షరతులు : 1) వేలము నందు పాల్గొనదలచిన వారు తమ ఫోటో మరియు సంతకముతో కూడిన గుర్తింపు కార్డు అందచేసి వేలం నందు పాల్గొనవలెను. ఇతరులకు అథరైజేషన్ ఇచ్చుట అనివార్యమైనప్పుడు అట్టి అథరైజేషను నోటరీ అఫిడవిట్ ద్వారా (ఫోటో, పూర్తి చిరునామాతో సహా) సమర్పించవలెను. లేనిచో, పాటదారులు మాత్రమే వేలములో పాల్గొనవలెను. ఇతరులు ఎవ్వరినీ అనుమతించబడదు. 2) దరఖాస్తులు దాఖలు చేసిన వారు మాత్రమే వేలమునకు అనుమతించబడును. 3) వేలం ఖాయపరిచిన తదుపరి గుత్తదారుడు 3 పోస్ట్ డేటెడ్ చెక్కులు సమర్పించవలెను. 4) వేలం ఖాయపరిచిన 7 రోజులలో గుత్తదారుడు తమ స్వంత ఖర్చులతో లీజుకాలమునకు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిస్ట్రేషన్ చేసుకొనవలెను, లేనిచో గుత్తేదారుని ధరావత్తు నగరపాలక సంస్థకు జమచేసుకొని లీజు రద్దు చేయబడును. 5) పై షరతులకు లోబడి బ్యాంకు గ్యారంటీ, లీజుకాలము రిజిస్ట్రేషన్ మరియు 6 నెలల అడ్వాన్సు సమర్పించిన తరువాత మాత్రమే ఆశీలు వసూలు చేసుకొనుటకు అనుమతించబడును. 6) పాట మరియు స్వీపర్ చార్జీల మొత్తమునకు జి.ఎస్.టి. 18% అదనము (కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనల ప్రకారము). 7) గతములో పాడుకొని కోర్టు కేసులు ఉన్నవారు మరియు నగరపాలక సంస్థకు ఏ విధమైన బకాయిలు ఉన్నవారు పాటలో పాల్గొనుటకు అనర్హులు

కమిషనరు,
నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం